TELTEL/2021/81472



# ప్రభ

దినపత్రిక
ప్రజ శ్రేయస్సే - ప్రభ లక్ష్యం

**విలేకరులు కావలెను**

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా ప్రభ దినపత్రికలో బ్యూరో, మండలలా రిపోర్టర్‌గా పని చేయుటకు జిల్లాల, నియోజకవర్గ స్థాయుల్లో ఉత్సహవంతులైన యువతి,యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును.

సంప్రదించవలసిన ఫోన్ నంబర్
ప్రభ 9642555562

ఎడిటర్ -బైరోజు కిషోర్ చారి | తెలంగాణ ,ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి - 4 | సంచిక- 276 | ఆదివారం | 28 -12-2025 | పేజీలు- 8 | వెల రూ. 5

## నకిలీ ఏజెంట్లతో జాగ్రత్త

హెచ్-1బీ వీసా దరఖాస్తుదారులకు అమెరికన్ ఎంబసీ హెచ్చరిక




2 లో

## పాక్‌తో అప్రమత్తంగా ఉండాల్సిందే

- పాక్ సైనిక వ్యూహాలను తేలికగా తీసుకోరాదు
- కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ కీలక వ్యాఖ్యలు



2 లో

## హైస్పీడ్ రైళ్లలో చైనా మరో ప్రపంచ రికార్డు..

- 2 సెకన్లలోనే 700km/h వేగాన్ని అందుకున్న రైలు..
- మాగ్లెవ్ రైలుతో చైనా అద్భుతం





## తెలుగు రాష్ట్రాల్లో పెరిగిన చలి

- పడిపోతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు
- అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక

హైదరాబాద్,
ఉభయ తెలుగు రాష్ట్రాల్లో చలి తీవ్రత రోజురోజుకూ ప ఎరుగుతోంది. రాత్రి ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతున్నాయి. దీంతో అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. గత పదేళ్లలో ఎక్కువ రోజులు తీవ్రమైన చలి కమ్ముకున్నది ఈసారి శీతాకాలంలోనే అని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. దాదాపు నెల రోజులుగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు బాగా తక్కువగా నమోదవుతున్నాయి. ఉమ్మడి మెదక్, ఆదిలాబాద్, రంగారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో ఆరేడు డిగ్రీలకు పడిపోతున్నాయి. హైదరాబాద్‌లోనూ ఈసారి చలి తీవ్రత చాలా ఎక్కువగా ఉంది.ఇంట్లో వెచ్చగా, బయట చలిగా ఉంటే... ఆ తర్వాత ఇంట్లో చలి వేస్తోంది, బయటికెళితే మాత్రం కాస్త ఉపశమనం అనిపిస్తోంది. శీతల గాలులు, మన ఇళ్ల గోడలే దీనికి కారణమని నిపుణులు చెబుతున్నారు. ఉత్తర వాయవ్య దిశ నుంచి వీస్తున్న శీతల గాలులతో రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు బాగా పడిపోయాయి. దీనితో ఇళ్ల కాంక్రీటు గోడలు, శ్లాబులు రాత్రంతా చల్లబడి చలి పెరుగుతోంది. ఇళ్ల గోడలు, శ్లాబ్ నుంచి రోజంతా చల్లదనం వెలువడుతోంది. దీనితో ఇంట్లో చలివేస్తోంది. పై అంతస్తు, ఆపైన ఉండే వారికి శీతలగాలుల ప్రభావంతో మరింత ఎక్కువగా చలి ఉంటోంది. మరోవైపు ఆకాశంలో మేఘాలు లేకపోవడంతో, గాలిలో తేమశాతం తక్కువగా ఉంటుండటంతో సూర్యకిరణాలు నేరుగా

-మిగతా 3 లో

# జనవరి 5 నుంచి ఉపాధి బచావో అభియాన్

## కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ నిర్ణయం

- మోడీ ప్రభుత్వంపై ప్రజల ఆగ్రహం
- రాష్ట్రాలు, పేదలపై విధ్వంసకర దాడి
- విలేకరుల సమావేశంలో మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ
- ఈ సమావేశంలో పాల్గొన్న ముఖ్యమంత్రులు ఎ.రేవంత్ రెడ్డి, సిద్ధరామయ్య, సుఖ్‌వీందర్ సింగ్ సుఖ్,

న్యూఢిల్లీ - డిసెంబరు 27 ప్రభ
గ్రామీణ ప్రజల జీవనోపాధిలో కీలకపాత్ర పోషించిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజీఎన్ఆర్ఈజీఏ) రద్దుకు వ్యతిరేకంగా జనవరి 5 నుంచి కాంగ్రెస్ దేశవ్యాప్తంగా ఆందోళన నిర్వహించనుంది. ఈ మేరకు శనివారం నాడిక్కడ కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం (ఇందిరా భవన్)లో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అధ్యక్షత నిర్వహించిన ఈ సమావేశంలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత సోనియా గాంధీ, తెలంగాణ, కర్నాటక, హిమాచల్ ప్రదేశ్

-మిగతా 2 లో




## డ్రగ్స్ కేసులో నిర్లక్ష్యం ఎందుకు?

- అకున్ సబర్వాల్‌ను తిరిగి నియమించండి
- మాజీ సిఎస్ సోమేశ్ కుమార్‌ను విచారించండి
- రాష్ట్రం తీరుపై కేంద్రమంత్రి బండి సంజయ్ ఆగ్రహం



హైదరాబాద్,-- డిసెంబరు 27 ప్రభ
రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్ కేసులను తీవ్రంగా పరిగణించడంలేదని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం పండుగలు, నూతన సంవత్సర వేడుకల సమయంలోనే డ్రగ్స్ కేసుల నమోదుకు పరిమితమవుతున్నారని ఆక్షేపించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అకున్ సబర్వాల్ ఆధ్వర్యంలో జరిపిన 'డ్రగ్స్ కేసు' విచారణ నివేదికపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని బండి సంజయ్ ప్రశ్నించారు. ఈమేరకు డ్రగ్స్ కేసులపై బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పండుగల అప్పుడే డ్రగ్స్ కేసులు నమోదు చేస్తారా?

-మిగతా 2 లో

## ఆర్ఎస్ఎస్ సంస్థ కాదు.. దేశానికి పట్టిన విషం


- కార్పొరేట్ల దోపిడీ ఆగాలంటే నిరంతర పోరాటాలు జరగాలి
- సినీ నటుడు ప్రకాశ్‌రాజ్




2 లో

## దళితుల భూమిని దౌర్జన్యంగా లాక్కుంటారా

- దుందిబీ నదిలో కాంగ్రెస్, బిఆర్ఎస్ నేతల ఇసుకదోపిడీ
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



నాగర్ కర్నూల్ - డిసెంబరు 27 ప్రభ
:మెడికల్ కాలేజీకి 40 ఎకరాల దళితుల భూములను దౌర్జన్యంగా లాక్కున్నారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో కాంట్రాక్టర్లకు అడ్వాన్స్‌డ్ కల్చర్‌ని సీఎం రేవంత్‌రెడ్డి తీసుకువచ్చారని ఆక్షేపించారు. దుందిబీ నదిలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు పోటాపోటీగా ఇసుక దోపిడీ చేస్తున్నారని ఆరోపణలు చేశారు. ఈమేరకు

-మిగతా 2 లో

## పింఛన్ పైసలతో ఢిల్లీకి మూటలు




- రేవంత్ ఒక్క భాషలో తిడితే.. నాకు నాలుగు భాషలు వచ్చు
- సర్పంచుల నిధులు ఎవరూ ఆపలేరు
- సెమీఫైనల్.. ఫైనల్ ఎన్నికలు ముందున్నాయి
- మహబూబాబాద్‌లో సర్పంచ్‌ల సన్మానంలో
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

మహబూబాబాద్ - డిసెంబరు 27 ప్రభ
"రాష్ట్రంలో రైతులకు రెండు సార్లు రైతుబంధు ఎగ్గొట్టిన దొంగ సీఎం రేవంత్ రెడ్డి.. మాయ మాటలు చెప్పి ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చారు. పేదలకు పెంచి ఇవ్వాల్సిన పింఛన్ డబ్బులను ఢిల్లీకి మూటలు కట్టి పంపిస్తున్నారు" అని బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. శనివారం మహబూబాబాద్‌లో బీఆర్ఎస్ సర్పంచ్‌లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు మాలోతు కవిత అధ్యక్షతన జరిగిన సమావేశంలో కేటీఆర్ ప్రసంగించారు. అధికార కాంగ్రెస్ పార్టీ ఎన్ని కుతంత్రాలు చేసినా బీఆర్ఎస్

-మిగతా 2 లో

## 15 శాతం తగ్గిన నేరాలు



- అత్యాధునిక టెక్నాలజీతో మెరుగైన సేవలు
- సంధ్య థియేటర్ ఘటనలో 100పేజీల చార్జ్‌షీట్
- డ్రగ్స్, డ్రంకెన్ డ్రైవ్‌పై ఉక్కుపాదం
- నార్కొటిక్ బృందాలను మరింత బలోపేతం చేస్తాం
- హైదరాబాద్ సీపీ విసి.సజ్జనార్

హైదరాబాద్, - డిసెంబరు 27 ప్రభ
నేర నియంత్రణలో అత్యాధునిక టెక్నాలజీతో మెరుగైన ఫలితాలు సాధించామని, గతేడాదితో పోల్చితే ఈ ఏడాది 15శాతం నేరాలు తగ్గాయని హైదరాబాద్ సీపీ విసి.సజ్జనార్ తెలిపారు. గతేడాదితో పోల్చితే మహిళలు, చిన్నారులపై మాత్రం నేరాలు పెరిగాయన్నారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఐసీసీసీలో శనివారం విలేకరుల సమావేశంలో 2025 వార్షిక నేర నివేదికను సీపీ విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాలు, నకిలీ వస్తువులు, విత్తనాల నియంత్రణపై డీసీపీ స్థాయి అధికారి పర్యవేక్షణలో ప్రత్యేక టీమ్స్‌ను ఏర్పాటు చేస్తామన్నారు.

-మిగతా2 లో

# హైస్పీడ్ రైళ్లలో చైనా మరో ప్రపంచ రికార్డు..

- 2 సెకన్లలోనే 700km/h వేగాన్ని అందుకున్న రైలు..
- మాగ్లెవ్ రైలుతో చైనా అద్భుతం



**న్యూఢిల్లీ,-**
హైస్పీడ్ రైళ్లలో డ్రాగన్ దేశం చైనా మరో ప్రపంచ రికార్డు నెలకొల్పింది. మాగ్నెటిక్ లెవిటేషన్ టెక్నాలజీతో నడిచే మాగ్లెవ్ రైలు ను పరీక్షించింది. ఈ రైలు రెండు సెకన్లలోనే గంటకు 700 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంది. రైలు వేగాన్ని చూసి అక్కడి అధికారులు, మీడియా ప్రతినిధులే ఆశ్చర్యానికి గురయ్యారు. 700 km/h వేగాన్ని అందుకున్న తర్వాత రైలును అధికారులు సురక్షితంగా ఆపగలిగారు. ఇది అత్యంత వేగవంతమైన సూపర్ కండక్టింగ్ ఎలక్ట్రిక్ మాగ్లెవ్ రైలుగా నిలిచింది. రైలు ట్రయల్ రన్స్‌కు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది.

# పాక్‌తో అప్రమత్తంగా ఉండాల్సిందే

**పాక్ సైనిక వ్యూహాలను తేలికగా తీసుకోరాదు**
**కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ కీలక వ్యాఖ్యలు**



**న్యూఢిల్లీ,-**
కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ సిందూర్ తరవాత మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం వచ్చిందన్నారు. పాక్‌ను తక్కువ అంచనా వేయకుండా అప్రమత్తంగా ఉండాలని, అలాగే దానిని నమ్మడానికి లేదన్నారు. పాకిస్థాన్‌లో మారుతున్న సైనిక వ్యూహాలు, అభివృద్ధి చెందుతున్న హైపర్ సోనిక్ క్షిపణి వ్యవస్థలను.. భారత్ తేలిగ్గా తీసుకోకూడదని హెచ్చరించారు . ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ థరూర్ ఈ వ్యాఖ్యలు చేశారు. పాక్‌తో ఉన్న గత అనుభవాల నుంచి భారత్ చాలా నేర్చుకున్నందున ఏ పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు పూర్తి సిద్ధంగా ఉండాలన్నారు. డ్రోన్లు, రాకెట్లు, క్షిపణుల తర్వాత హైపర్‌సోనిక్ సాంకేతికతపై పాక్ దృష్టిసారించిందన్నారు. ఇది భారత్ తేలికగా తీసుకునే విషయం కాదన్నారు. పాక్‌లో ప్రజాస్వామ్యం నామమాత్రంగానే ఉందని.. ఇప్పటికీ సైనిక ఆధిపత్యమే కొనసాగుతుందన్నారు. ఆర్థికంగా దుర్భర పరిస్థితిలో ఉన్న ఆ దేశం.. విదేశాల నుంచి అందే సాయంపైనే ఆధారపడుతుందని థరూర్ అన్నారు. ఇక, బంగ్లాదేశ్ దాని సొంత సమస్యలతో సతమతమవుతోందన్నారు. పాక్‌తో రక్షణ ఒప్పందానికి బంగ్లా చేస్తున్న చర్చల గురించి ప్రస్తావిస్తూ.. భారత్ మాకు శత్రువు అనే అభిప్రాయాన్ని కల్పించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. పొరుగు దేశాల్లో పెరుగుతున్న భారత వ్యతిరేకతపై ఆయన మాట్లాడుతూ.. బంగ్లాలో స్థిరమైన, శాంతియుత వాతావరణం మనకు చాలా కీలకమన్నారు. ఈశాన్య రాష్ట్రాలను భారత్ నుంచి విడదీస్తామంటూ వస్తోన్న హెచ్చరికలపై ఆందోళన వ్యక్తం చేశారు.

# నకిలీ ఏజెంట్లతో జాగ్రత్త

**హెచ్-1బీ వీసా దరఖాస్తుదారులకు హెచ్చరిక**




**న్యూఢిల్లీ-**
హెచ్-1బీ వీసాల జారీ, రెన్యువల్ సత్వరమే చేయిస్తామంటూ కొందరు నకిలీ ఏజెంట్లు దరఖాస్తుదారులను మోసగిస్తున్నారని భారత్‌లోని అమెరికన్ ఎంబసీ హెచ్చరించింది. అమెరికన్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆంక్షల నేపథ్యంలో మోసగాళ్లు హెచ్-1బీ వీసా దరఖాస్తుదారులను సంప్రదిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపింది. ఇటువంటి మోసగాళ్ల హామీలను నమ్మవద్దని హెచ్చరించింది. వీరిని నమ్మితే, ఆర్థిక నష్టంతో పాటు ప్రయాణ ప్రణాళికల్లో ఇబ్బందులు ఎదురవుతాయని వివరించింది. వీసా అపాయింట్‌మెంట్లు అధికారిక వెబ్‌సైట్ల ద్వారా మాత్రమే షెడ్యూల్ అవుతాయని తెలిపింది. ఇతర మార్గాల్లో వీసా ఇప్పిస్తామని ఎవరైనా హామీ ఇస్తే, అది మోసపుచ్చడమే అవుతుందని పేర్కొంది. అధికారిక ప్రక్రియలో భాగంగా నిర్దేశించిన ఫీజు కంటే ఎక్కువ సొమ్మును చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం సోషల్ మీడియా వెట్టింగ్ విధానాన్ని అమలు చేస్తున్నది. ఫలితంగా వీసా ఇంటర్వ్యూలు కొన్ని నెలలపాటు వాయిదా పడ్డాయి.

# ఆర్ఎస్ఎస్ సంస్థ కాదు.. దేశానికి పట్టిన విషం

**కార్పొరేట్ల దోపిడీ ఆగాలంటే నిరంతర పోరాటాలు జరగాలి**
**: సినీ నటుడు ప్రకాశ్‌రాజ్**

**విశాఖ :**
'వందేండ్ల ఉత్సవాలు ఆర్ఎస్ఎస్ చేసుకోవడానికి ఏం సాధించింది. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో వారు పాల్గొన్నట్టు ఒక్క పేరునైనా ఎవరైనా చెప్పగలరా? ఈ వందేండ్లలో వారు చెడ్డీల నుంచి ప్యాంటులకు వచ్చారు. మీకు కమలం పువ్వు పైకి కనిపిస్తోంది. నేను దాని కింద ఉన్న విషపు వేళ్లను చూసి చెబుతున్నాను. ఆర్ఎస్ఎస్, బీజేపీ ఈ దేశానికి పట్టిన విషం' అని ప్రగతిశీలవాది, ప్రముఖ సినీనటుడు ప్రకాశ్‌రాజ్ అన్నారు. భారతదేశం సరోవరం అయితే అందులో బ్రహ్మ రాక్షసుడు ఆర్ఎస్ఎస్ అని ఆయన వ్యాఖ్యానించారు. సీఐటీయూ అఖిల భారత మహాసభ సందర్భంగా శనివారం నుంచి వారం రోజులపాటు విశాఖలో తలపెట్టిన శ్రామిక ఉత్సవ్ ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన సీఐటీయూ ఆధ్వర్యంలో విశాఖలోని దసపల్లా హోటల్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. తొలుత మీడియా వారు 'ఎలా వున్నారు సార్' అనగానే 'ఏముందన్నా కార్మికులు, వారికోసం పోరాడే వారంటే నాకెంతో ఇష్టం. సీఐటీయూ పిలవగానే విశాఖపట్నం వచ్చేశాను' అనడంతో అందరూ ఆనందం వ్యక్తం చేశారు. ఈ రోజు నుంచి వారంపాటు సాంస్కృతిక ఉత్సవాలు, ఆటాపాట, కవులు, రచయితలతో సందడిగా విశాఖ ఉంటుందని, సినిమా నటులను పిలవడం సహజం కదా అని ప్రకాశ్‌రాజ్ అంటూనే 'అయితే నేను నటుడిని మాత్రమే కాదు.. అభ్యుదయ ఆలోచనలు, ఆందోళనలకు అండగా ఉండే వ్యక్తిని' అని చెప్పుకొచ్చారు.

# జనవరి 5 నుంచి ఉపాధి బచావో అభియాన్

మొదటి తరువాయి

ముఖ్యమంత్రులు ఎ.రేవంత్ రెడ్డి, సిద్ధరామయ్య, సుఖ్‌వీందర్ సింగ్ సుఖ్, ప్రధాన కార్యదర్శులు కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్, సీడబ్ల్యూసీ సభ్యులు పాల్గొన్నారు. తొలుత మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్‌కు నివాళులర్పించారు. ఇటీవల మరణించిన కాంగ్రెస్ నేతలు శివరాజ్ పాటిల్, శ్రీప్రకాష్ జైస్వాల్‌కు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళు లర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ ఎంజీఎన్ఆర్ఈజీఏ రద్దుపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని, దాని పరిణామాలను మోడీ ప్రభుత్వం ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. దేశవ్యాప్తంగా "ఎంజీఎన్ఆర్ఈజీఏ బచావో అభియాన్"ను నిర్వహిస్తామన్నారు. వీబీ-జీ రామ్ జీ చట్టంతో రాష్ట్రాలపై అదనపు ఆర్థిక భారం పడుతోందని, రాష్ట్రాలు, రాజకీయ పార్టీలతో ఎలాంటి సంప్రదింపులు లేకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారని విమర్శించారు. పేదలను అణచివేయడానికి తీసుకొచ్చిన ఈ చట్టానికి వ్యతిరేకంగా వీధుల్లో, పార్లమెంట్‌లో పోరాడుతామని హెచ్చరించారు. 2015లో భూ సేకరణ చట్ట సవరణలు, 2020-21లో రైతులు చారిత్రాత్మక పోరాటంతో మోడీ ప్రభుత్వం ఉపసంహరించుకున్న మూడు వ్యవసాయ చట్టాల వలే, దీన్ని ఉపసంహరించుకోవాల్సి వస్తుందన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) తీవ్రమైన సమస్య అని, దేశ ప్రజల ప్రజాస్వామ్య హక్కులను పరిమితం చేయడానికి మోడీ ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల సంఘం కలిసి పన్నిన కుట్ర అని ధ్వజమెత్తారు. అత్యంత వెనుకబడిన




తరగతులు, దళితులు, గిరిజనలు, మైనారిటీ పేర్లను ఓటర్ జాబితా నుంచి తొలగించకుండా, ఇతర బూత్‌లకు బదిలీ చేయకుండా చూసుకోవాలని సూచించారు. దీనికి కోసం బూత్ స్థాయి ఏజెంట్లు ఇంటింటికీ వెళ్లాలన్నారు. కాంగ్రెస్ 'సంస్థా సృజన అభియాన్'ను కొనసాగిస్తామని తెలిపారు. 500 జిల్లాల్లో జిల్లా అధ్యక్షుల నియామకం పూర్తయిందని, బూత్ స్థాయి వరకూ పార్టీని బలోపేతం చేస్తున్నామని చెప్పారు. 2026లో రాష్ట్రాల్లో జరిగే ఎన్నికలకు కాంగ్రెస్ సిద్ధమని స్పష్టం చేశారు. ఈడీ, ఐటీ, సీబీఐల దుర్వినియోగం జరుగుతోందని, నేషనల్ హెరాల్డ్ కేసులో న్యాయ పోరాటం కొనసాగుతోందని తెలిపారు. బంగ్లాదేశ్‌లో హిందూ మైనారిటీలపై దాడులను ఆయన ఖండించారు. ఈ ఘటనపై దేశం మొత్తం ఆందోళన చెందుతోందన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌తో సంబంధం ఉన్న సంస్థలు క్రిస్మస్ వేడుకలపై చేసిన దాడులు మత సామరస్యాన్ని దెబ్బతీశాయని, ప్రపంచ వ్యాప్తంగా దేశ ప్రతిష్టకు కళంకం తీసుకువచ్చాయని విమర్శించారు.

**రాష్ట్రాలు, పేదలపై విధ్వంసకర దాడి**

మోడీ సర్కార్ రాష్ట్రాలు, పేద ప్రజలపై నోట్ల రద్దు మాదిరిగానే విధ్వంసకర దాడికి పాల్పడిందని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శించారు. ప్రభుత్వ చర్యను కాంగ్రెస్ ప్రతిఘటిస్తోందని, ఇందుకు ప్రతిపక్షాలన్నీ మద్దతిస్తున్నాయని స్పష్టం చేశారు. 2006లో ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభమైన ఈ పథకం గ్రామీణ భారత ముఖచిత్రాన్ని మార్చిందని, దళితులు, ఆదివాసీలు, మహిళలకు భరోసా ఇచ్చిందని, పేదరికం నుంచి బయటపడ్డ తరాన్ని సృష్టించిందని వివరించారు. 'పేదల కడుపుపై తన్నిన మోడీ ప్రభుత్వం,పేదల కంటే కార్పొరేట్ల లాభాలే ముఖ్యం' అని విమర్శించారు. ఎంజీఎన్ ఆర్ఈజీఏ కేవలం ఒక చట్టం కాదని, రాజ్యాంగం ఇచ్చిన పని హక్కు అని వెల్లడించారు. ఉపాధి హామీ చట్టానికి ప్రపంచ వ్యాప్తంగా ప్రశంసలు వెల్లువెత్తాయని, దాన్ని రద్దు చేయడమంటే మహాత్మా గాంధీని అవమానించడ మేనని దుయ్యబట్టారు. ప్రధాని మంత్రివర్గాన్ని సంప్రదించకుండా, అధ్యయనం చేయకుండా ఏకపక్ష నిర్ణయం తీసుకున్నారని ధ్వజమెత్తారు. దేశంలో పాలన వన్ మ్యాన్ షోగా మారిపోయిందనడానికి ఇదే ఉదాహరణ అని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న ఇటువంటి నియంతృత్వ చర్యలకు వ్యతిరేకంగా పోరాడేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఉద్యోగాలు ఇవ్వకుండా యువత భవిష్యత్‌ను నాశనం చేసిన మోడీ ప్రభుత్వం, ఇప్పుడు గ్రామీణ ప్రజల ఉపాధిని దెబ్బతీస్తోందని మండిపడ్డారు. ఎన్నో ఏండ్లుగా ఆర్థిక భరోసానిస్తున్న పథకాన్ని ఆపితే ప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు.

# డ్రగ్స్ కేసులో నిర్లక్ష్యం ఎందుకు?

మొదటి తరువాయి

అని రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అకున్ సబర్వాల్ ఆధ్వర్యంలో నాటి డ్రగ్స్ కేసు విచారణ ఏమైంది..? అని నిలదీశారు. అనేకమంది సెలబ్రిటీల పేర్లు బయటకు వచ్చాయి కదా..? ఏం చేశారని ప్రశ్నించారు. తమతోపాటు కేసీఆర్ కుటుంబ సభ్యులు కూడా డ్రగ్స్ తీసుకున్నారని.. గతంలో నిందితులు వాంగ్మూలం ఇచ్చారు కదా అని గుర్తుచేశారు. శనివారం హైదరాబాద్ లో మీడియాతో మాట్లాడారు బండి సంజయ్. నిందితుల వాంగ్మూలం ఆడియో, వీడియో రికార్డు చేశారని తెలిపారు. తమ కుటుంబ సభ్యుల భవిష్యత్ నాశనమవుతుందనే భయంతోనే.. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఈ కేసు నీరుగార్చారని ఆరోపించారు. అకున్ సబర్వాల్‌ను డ్రగ్స్ కేసు నుంచి ఎందుకు తప్పించారని ప్రశ్నించారు. అకున్ సబర్వాల్ సేకరించిన ఆధారాలు, వీడియో స్టేట్‌మెంట్స్‌ను నాటి సీఎస్ సోమేశ్‌కుమార్ స్వాధీనం చేసుకున్నారని ప్రస్తావించారు. గతంలో సేకరించిన ఆధారాలు ఏమయ్యాయని నిలదీశారు. ఈ విషయంలో సోమేశ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నించాలని అన్నారు. డ్రగ్స్ కేసులో ఈగల్ టీమ్ లీగల్‌గా విధులు నిర్వహిస్తోందా..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. ఈగల్ టీమ్‌లో కొంతమంది డ్రగ్ పెడ్లర్లతో రాజీపడుతున్నారని ఆరోపణలు చేశారు. అకున్ సబర్వాల్‌కి తిరిగి డ్రగ్స్ కేసు బాధ్యతలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బండి సంజయ్ కుమార్ డిమాండ్ చేశారు. నాటి డ్రగ్స్ కేసులో అనేక మంది బడా వ్యక్తులు, సినీ ప్రముఖులు ఉన్నారు. పట్టుబడిన వాళ్లను అకున్ సబర్వాల్ టీం నాడు విచారణ చేస్తే.. ఆ వాంగ్మూలంతో కూడిన ఆడియో, వీడియో రికార్డులు బయటకు రాకుండా అడ్డుకున్నారు. అదే సమయంలో ఆ కేసుపై అకున్ సబర్వాల్ టీం రూపొందించిన నివేదిక, రికార్డు చేసిన ఆడియో, వీడియో, స్టేట్ మెంట్లన్నింటినీ నాటి సీఎస్ సోమేశ్ కుమార్ స్వాధీనం చేసుకున్నారు. ఆ తరువాత డ్రగ్స్ కేసును పూర్తిగా నీరుగార్చారు. అకున్ సబర్వాల్ సేకరించిన ఆధారాలు, ఆడియో, వీడియో రికార్డులు, స్టేట్ మెంట్లను సోమేశ్ కుమార్ తదుపరి విచారణ టీమ్‌కు అప్పగించలేదు.. వాటిని కోర్టుకు స్వాధీనం చేయలేదు.

కాంగ్రెస్ ప్రభుత్వానికి నిజంగా డ్రగ్స్ నిర్మూలనపై చిత్తశుద్ధి ఉంటే సీఎం ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఈగల్ టీమ్ వెంటనే రంగంలోకి దిగి సోమేశ్ కుమార్‌ను విచారించాలని అన్నారు. ఈగల్ టీమ్‌లో సమర్థులైన అధికారులు ఉన్నప్పటికీ, ఒకరిద్దరు మాత్రం డ్రగ్స్ పెడ్లర్లతో రాజీపడుతున్నారు. రాష్ట్రంలో విచ్చలవిడిగా పెరుగుతున్న డ్రగ్స్ విక్రయాలపై ఉక్కుపాదం మోపాలంటే.. అకున్ సబర్వాల్ వంటి సమర్థులైన అధికారులకు తిరిగి 'డ్రగ్స్ కేసు' విచారణ బాధ్యతలను అప్పగించాలని డిమాండ్ చేశారు.

# పింఛన్ పైసలతో ఢిల్లీకి మూటలు

మొదటి తరువాయి

సర్పంచ్‌లు 1500 మంది గెలిచారన్నారు. బీఆర్ఎస్ సర్పంచ్‌లకు నిధులు ఇవ్వబోమని ఎమ్మెల్యేలు బెదిరిస్తున్నారని.. కానీ రాజ్యాంగం, ఫైనాన్స్ కమిషన్ నిబంధన ప్రకారం కేంద్రం ఇచ్చే ప్రతి రూపాయికీ 85 పైసలు నేరుగా సర్పంచ్‌ల ఖాతాల్లో పడతాయని చెప్పారు. ఏ గొట్టంగాడూ నిధులు ఆపలేడని, సర్పంచ్‌లు మరింత స్ఫూర్తితో గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. 'సర్పంచ్ ఎన్నికలు క్వార్టర్ ఫైనల్ మాత్రమే.. ముందు మున్సిపల్, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు సెమీఫైనల్.. 2028లో ఫైనల్ ఎన్నికలు ఉన్నాయి.. కేసీఆర్‌ను తిరిగి సీఎం చేయడమే లక్ష్యం" అని కేటీఆర్ అన్నారు. రేవంత్‌రెడ్డికి ఒకటే భాష వచ్చు అని తనకు నాలుగు భాషలు వచ్చు అని, తాను నాలుగు భాషల్లో తిట్టగలనని, కానీ.. తనకు సంస్కారం అడ్డొస్తుందని అన్నారు. కేసీఆర్ రైతులు అడగకుండా.. దరఖాస్తు చేయకుండా 11సార్లు రూ.73 వేల కోట్ల రైతుబంధు నిధులు జమ చేశారని గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ వచ్చాక రెండుసార్లు ఎగ్గొట్టారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో కౌలు రైతులకు రైతుబంధు ఇస్తానని, అత్తకు రూ.4వేల పింఛన్, కోడలుకు రూ.2500 ఆత్మీయ భరోసా ఇస్తానని, కల్యాణ లక్ష్మిలో తులం బంగారం ఇస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ, రేవంత్ తులం బంగారం ఇచ్చే టైపు కాదని, మెడలో ఉన్న పుస్తెలతాడు ఎత్తుకుపోయే టైపు అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్రావు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యేలు డిఎస్ రెడ్యా నాయక్, శంకర్ నాయక్, హరిప్రియ నాయక్, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు సత్యవతి రాథోడ్, కెఎస్ఎన్.రెడ్డి, యాళ్ల మురళీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

# 15 శాతం తగ్గిన నేరాలు

మొదటి తరువాయి

రానున్న రోజుల్లో నార్కొటిక్ టీమ్స్‌ను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. దేశంలోనే తెలంగాణ పోలీసులు నెంబర్‌వన్ స్థాయిలో ఉన్నారని, గతంతో పోలిస్తే నగరంలో లా అండ్ ఆర్డర్ బాగుందని, క్రైమ్‌రేట్ అదుపులో ఉందని తెలిపారు. నగర పోలీసులు ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటారని, ఏ ఆపద వచ్చినా డయల్ 100కు ఫోన్ చేయాలని కోరారు. అత్యాశకుపోయి నగరవాసులు సైబర్ నేరాలలో చిక్కుకుంటున్నారని, వాటిపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. నగర వ్యాప్తంగా 5లక్షల 20 వేల సీసీ కెమెరాలను వినియోగిస్తున్నామన్నారు.

**మహిళలపట్ల పెరిగిన నేరాలు**

ఈ ఏడాది మహిళలపై (జరిగిన దాడులు, లైంగిక వేధింపులతోపాటు ఇతర నేరాలు) 6 శాతం నేరాలు పెరిగాయని సీపీ తెలిపారు. గతేడాది 2,482 వరకు కేసులు నమోదైతే, ఈ ఏడాది 2,625 కేసులు నమోదయ్యాయన్నారు. చిన్నారులపై సైతం (నేరాలు) దాడులు పెరిగాయన్నారు. ఈ క్రమంలో 7శాతం పోక్సో కేసులు అధికమయ్యాయన్నారు. చిన్నారులపై దాడులు, ఇతర నేరాలకు పాల్పడిన వారిపై 2024లో 449కేసులు నమోదైతే, ఈ ఏడాది 568కేసులు నమోదయ్యాయన్నారు. గతేడాది మహిళలపై లైంగికదాడి కేసులు 484 నమోదైతే ఈ ఏడాది 405 నమోదయ్యాయన్నారు.

వీటితోపాటు 7 శాతం దోపిడీలు పెరిగాయని తెలిపారు. కిడ్నాప్ కేసులు 2024లో 324 నమోదైతే, 2025లో 166కేసులు నమోదయ్యాయన్నారు.

# తెలుగు రాష్ట్రాల్లో పెరిగిన చలి

మొదటి తరువాయి

దూసుకొస్తున్నాయి. సూర్యాస్తమయం వరకు ఈ ప్రభావం ఉంటోంది. తర్వాత మళ్లీ బయట చలిపెరుగుతోంది. ఇళ్లలో వెచ్చగా ఉంటోంది. హెచ్‌సీయూ, పటాన్‌చెరు, గచ్చిబౌలి, రాజేంద్రనగర్ వంటి శివారు ప్రాంతాల్లో 6-8 డిగ్రీల మధ్య కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.తెలంగాణలో జనవరి రెండో వారం నుంచి కనిష్ఠ ఉష్ణోగ్రతలు 13 డిగ్రీలు, ఆపైన నమోదవుతాయని వాతావరణ వివరాలు, ముందస్తు అంచనాలు అందించే 'స్కైమెట్ ' వెబ్‌సైట్ అంచనా వేసింది. మరో వాతావరణ వెబ్‌సైట్ ఆక్యువెదర్.. జనవరి తొలివారం తర్వాత చలి నుంచి ఉపశమనం ఉంటుందని, నెలాఖరుకల్లా కనిష్ఠ ఉష్ణోగ్రతలు 18-19 మధ్యకు చేరుతాయని పేర్కొంది. ఈనెల 31వరకు తీవ్రమైన చలి పరిస్థితులు కొనసాగుతాయని.. కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మరో 3-4 డిగ్రీలు తక్కువగా నమోదవుతాయని వాతావరణ నిపుణులంతా చెబుతున్నారు. సాధారణంగా 12 డిగ్రీలకుపైన ఉష్ణోగ్రతలు ఉన్నప్పుడు కాంక్రీటు గోడలు, శ్లాబులు ఆ చల్లదనానికి పెద్దగా ప్రభావితం కావు. అంతకన్నా ఎంత తగ్గుతూ పోతే.. అంతగా చల్లబడి, 'ప్రభావం అంతగా పెరుగుతుంది. రాత్రి ఉష్ణోగ్రతలు 8, 9 డిగ్రీలకు తగ్గిపోతే... గోడలు, శ్లాబు నుంచి తర్వాతి రోజంతా చల్లదనం వెలువడుతూనే ఉంటుంది. దానితో బయటికంటే ఇంట్లో చలి ఎక్కువగా ఉంటుంది. ఈ ఏడాది వానలు ఎక్కువగా కురవడం, ఉత్తర వాయవ్య దిశ నుంచి వీస్తున్న శీతల గాలులతో కనిష్ఠ ఉష్ణోగ్రతలు బాగా పడిపోయాయి. గత పదేళ్లలో అతి తక్కువ కనిష్ఠ ఉష్ణోగ్రతలు, ఎక్కువ రోజులు కొనసాగడం ఈసారే చూస్తున్నాం. మరో 10 రోజుల వరకు చలి తీవ్రత కొనసాగే అవకాశం ఉంది. సంక్రాంతి తర్వాత రాత్రిపూట ఉష్ణోగ్రతలు పెరుగుతాయి.

# దళితుల భూమిని దౌర్జన్యంగా లాక్కుంటారా

మొదటి తరువాయి

కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డిపై కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డిది డైవర్షన్, కరప్షన్ పాలన అని విమర్శలు చేశారు. శనివారం నాగర్ కర్నూలు జిల్లాలోజాగృతి జనం బాటలో భాగంగా పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలతో ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలు తెలుసుకున్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని ధైర్యం చెప్పారు. అనంతరం మీడియాతో మాట్లాడారు కవిత. అభివృద్ధి అవకాశాలు అందరికీ సమానంగా రావాలని సూచించారు. సామాజిక తెలంగాణ సాధనకు తాను కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో కాళేశ్వరాన్ని పరుగులు పెట్టించినట్లుగా పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టును ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. నల్ల మట్టి తీసేందుకు రైతుల వద్ద తీసుకున్న900 ఎకరాల భూమిని వారికి వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. పదేళ్లలో డిండి ప్రాజెక్ట్‌కి నీటిని తరలించలేదని.. ప్రభుత్వం మారిన కూడా ఇంకా సర్వేలే జరుగుతున్నాయని కవిత విమర్శించారు.

# పాకిస్థాన్‌కు మేధో గండం


**5వేల మంది డాక్టర్లు, 11 వేల మంది ఇంజినీర్లు.. గత రెండేళ్లలో పాకిస్థాన్‌ను విడిచివెళ్లారు**



**న్యూఢిల్లీ- - డిసెంబరు 27 ప్రభ**

పాకిస్థాన్‌లో తీవ్ర రాజకీయ సంక్షోభం ఆ దేశ ఆర్థిక సంక్షోభానికి దారి తీస్తున్నది. వేల సంఖ్యలో నైపుణ్యం ఉన్న ఉద్యోగులు దేశాన్ని విడిచి వెళుతున్నారు. గత రెండేళ్లలో ఆ సంఖ్య మరింత రెట్టింపు అయినట్లు తెలుస్తోంది. కొనసాగుతున్న రాజకీయ అనిశ్చిత వల్ల.. దేశ ఆర్థిక పరిస్థితి కూడా దిగజారిపోతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. గత రెండేళ్లలో 5000 మంది డాక్టర్లు, 11000 మంది ఇంజినీర్లు, 13000 మంది అకౌంటెంట్లు పాకిస్థాన్‌ను వీడి వెళ్లినట్లు ఓ ప్రభుత్వ నివేదిక ద్వారా వెల్లడైంది. బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్ అండ్ ఓవర్‌సీస్ ఎంప్లాయిమెంట్ ఈ డేటాను రిలీజ్ చేసింది. అయితే ఆర్మీ చీఫ్ జనరల్ అసిమ్ మునీ .. ఈ వలసలను బ్రెయిన్ గెయిన్‌గా వర్ణించారు. నిజానికి బ్రెయిన్ డ్రెయిన్ అవుతున్న విషయాన్ని పాకిస్థాన్ గ్రహించడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. పాకిస్థాన్ మాజీ సేనేటర్ ముస్తాఫా నవాజ్ కోకర్ ఈ రిపోర్టును ప్రస్తావించారు. దేశ ఆర్థిక వ్యవస్థను సరిచేయాలంటే ముందుగా రాజకీయ వ్యవస్థను సరిచేయాలన్నారు. ఇంటర్నెట్ షట్‌డౌన్ ద్వారా దేశానికి 1.62 బిలియన్ల డాలర్ల నష్టం వచ్చిందన్నారు.

# థాయిలాండ్, కంబోడియా మధ్య కాల్పుల విరమణ ఒప్పందం



**చాంతబురి-- డిసెంబరు 27 ప్రభ**

థాయిలాండ్, కంబోడియా దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం జరిగింది. రెండు దేశాలకు చెందిన రక్షణ మంత్రులు ఇవాళ దీనిపై సంయుక్త ప్రకటన చేశారు. కంబోడియా రక్షణ మంత్రి టీ సేహ, థాయిలాండ్ మంత్రి నట్టఫోన్ నర్కఫనిట్ కాల్పుల విమరణ ఒప్పందంపై సంతకాలు చేశారు. థాయ్‌లోని చాంతబురి ప్రావిన్సులో ఇద్దరు మంత్రల మీటింగ్ జరిగింది. సైనిక బలగాల కదలికలపై రెండు దేశాలు తక్షణ ఆంక్షలు విధించాయి. బోర్డర్ వద్ద ఉన్న సాధారణ పౌరులు స్వంత ఇండ్లకు చేరుకునే అవకాశం కల్పించారు.గత కొన్నాళ్ల నుంచి థాయ్, కంబోడియా బోర్డర్ వద్ద తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న విషయం తెలిసిందే. బోర్డర్ కాల్పుల్లో సుమారు 41 మంది మరణించారు. లక్షల సంఖ్యలో జనం తరలి వెళ్లారు. శనివారం మధ్యాహ్నం నుంచి కాల్పుల విరమణ అమలులోకి రానున్నది. థాయ్‌ల్యాండ్ ఆధీనంలో ఉన్న 18 మంది కంబోడియా సైనికులను త్వరలో రిలీజ్ చేయనున్నట్లు ప్రకటనలో తెలిపారు. కొన్ని రోజుల పాటు జరిగిన చర్చల ఫలితంగా థాయ్, కంబోడియా మధ్య ఒప్పందం కుదిరింది.

# పాకిస్తాన్‌లో 13 మంది ఉగ్రవాదులు మృతి



**ఇస్లామాబాద్ - డిసెంబరు 27 ప్రభ**

పాకిస్తాన్ బలూచిస్తాన్ ప్రావిన్స్‌లో వివిధ నిఘా ఆధారిత కార్యకలాపాలలో పాకిస్తాన్ భద్రతా దళాలు నిషేధిత తిరుగబాటు గ్రూపులకు చెందిన 13 మంది ఉగ్రవాదుల్ని హతమార్చాయి. ఈ విషయాన్ని ఇంటర్ సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్ (ఐఎస్‌పిఆర్) శనివారం వెల్లడించింది. డిసెంబర్ 24, 25 తేదీల్లో ప్రావిన్స్‌లోని కోహ్లు, కలాట్ ప్రాంతాల్లో నిర్వహించిన రెండు ఆపరేషన్లలో ఈ ఉగ్రవాదులు హతమైనట్లు మిలటరీ మీడియా విభాగం, ఐఎస్‌పిఆర్ తెలిపింది. రెండు ప్రకటనల్లో ఆయా ప్రాంతాలలో ఉగ్రవాదులపై నిఘా ఆధారిత కార్యకలాపాలు నిర్వహించినట్లు ఐఎస్‌పిఆర్ తెలిపింది. కొహ్లులో చేపట్టిన ఆపరేషన్‌లో ఐదుగురు, డిసెంబర్ 25న కలాట్ ప్రాంతంలో నిర్వహించిన ఆపరేషన్‌లో ఎనిమిది మంది ఉగ్రవాదులు మృతి చెందినట్లు ఐఎస్‌పిఆర్ వెల్లడించింది. సైనిక బలగాలు చేపట్టిన ఆపరేషన్స్‌లో మొత్తంగా 13 మంది ఉగ్రవాదులు హతమయ్యారు. ఉగ్రవాదుల నుంచి ఆయుధాలు, మందుగుండి సామాగ్రి, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసు భద్రతా దళాలు ప్రకటనలో తెలిపాయి. ఇక ఈ నెల ప్రారంభంలో కలాట్‌లో భద్రతా దళాలు 12 మంది ఉగ్రవాదులను హతమార్చాయి. గత కొంతకాలంగా పాకిస్తాన్ భద్రతా దళాలు ఉగ్రవాదుల ఏరివేత లక్ష్యంగా 'అజ్మ్-ఎ-ఇస్తేకామ్' ఆపరేషన్స్ నిర్వహిస్తున్నాయి.

# సత్య నాదెళ్ల, సుందర్ పిచాయ్‌ని వెనక్కి నెట్టి..
# రిచ్‌లిస్ట్‌లో అగ్రస్థానంలో నిలిచిన జయశ్రీ ఉల్లాల్..

**న్యూఢిల్లీ- - డిసెంబరు 27 ప్రభ**

ప్రపంచ టెక్ రంగంలో అత్యంత సంపన్న సీఈవోలు ఎవరంటే ముందుగా గుర్తొచ్చే పేర్లు భారత సంతతికి చెందిన సత్య నాదెళ్ల, సుందర్ పిచాయ్ . గత కొన్ని సంవత్సరాలుగా ఈ ఇద్దరూ టెక్ రంగంలో భారత సంతతికి చెందిన అత్యంత సంపన్న ఎగ్జిక్యూటివ్‌లుగా కొనసాగుతున్నారు. అయితే, ప్రస్తుతం ఆ స్థానాన్ని వారు కోల్పోయారు. తాజా నివేదికల ప్రకారం ఈ ఇద్దరినీ వెనక్కి నెట్టి అరిస్టా నెట్‌వర్క్స్ ప్రెసిడెంట్, సీఈవో జయశ్రీ ఉల్లాల్ అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నారు.హురున్ ఇండియా రిచ్ లిస్ట్ 2025 ప్రకారం.. టెక్ సీఈవోల్లో జయశ్రీ ఉల్లాల్ అత్యంత సంపన్నురాలిగా నిలిచారు. రూ.50,170 కోట్ల నికర విలువతో ఉల్లాల్ అగ్రస్థానంలో నిలిచారు. ఆ తర్వాత మైక్రోసాఫ్ట్ సీఈవో సత్యనాదెళ్ల రూ.9,770 కోట్ల నికర విలువతో రెండోస్థానంలో నిలవగా.. రూ. 5,810 కోట్లతో గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ ఏడో స్థానాన్ని సరిపెట్టుకున్నారు.ఎవరీ జయశ్రీ ఉల్లాల్..పలు నివేదికల ప్రకారం.. ఉల్లాల్ 1961, మార్చి 27న లండన్‌లో భారత సంతతికి చెందిన హిందూ కుటుంబంలో జన్మించారు. అయితే ఐదేళ్ల వయసులో ఆమె కుటుంబం భారత్‌కు వలస వచ్చేసింది. ఆమె తండ్రి ఒక భౌతిక శాస్త్రవేత్త. ఆయన ఐఐటీల ఏర్పాటులో కీలక పాత్ర పోషించినట్లు బ్లూమ్‌బర్గ్ నివేదించింది.



జయశ్రీ న్యూఢిల్లీలోని కాన్వెంట్ ఆఫ్ జీసెస్ అండ్ మేరీలో పాఠశాల విద్యను అభ్యసించారు. అనంతరం తండ్రి ఉద్యోగరీత్యా శాన్‌ఫ్రాన్సిస్కోకు వెళ్లారు. అక్కడ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో బ్యాచిలర్ డిగ్రీ, ఇంజినీరింగ్ మేనేజ్‌మెంట్‌లో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశారు జయశ్రీ.కెరీర్ తొలినాళ్లలో పలు సంస్థల్లో పనిచేసిన జయశ్రీ.. 2008 నుంచి కంప్యూటర్ నెట్‌వర్కింగ్ సంస్థ అయిన అరిస్టా నెట్‌వర్క్స్‌కు నాయకత్వం వహిస్తున్నారు. ఫోర్బ్స్ కథనం ప్రకారం 2024లో కంపెనీ ఆదాయం 7 బిలియన్ డాలర్లకు చేరింది. ఇది అంతకుముందు ఏడాదితో పోలిస్తే దాదాపు 20 శాతం అధికం. కంపెనీ స్టాక్‌లో జయశ్రీకి దాదాపు 3 శాతం వాటా ఉంది. ఆమె నేతృత్వంలో సంస్థ అద్భుతమైన వృద్ధిని నమోదు చేసింది.

# హాలిడే సీజన్‌లో అమెరికాను
# వణికిస్తున్న డెవిన్ మంచు తుపాను..

## 1,800 విమానాలు రద్దు

**న్యూఢిల్లీ- - డిసెంబరు 27 ప్రభ**

అమెరికాలో ప్రస్తుతం హాలిడే సీజన్ నడుస్తోంది. క్రిస్మస్, న్యూఇయర్ సందర్భంగా విద్యాసంస్థలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలకు సెలవులు ఉన్నాయి. దీనికి తోడు శీతాకాలం కావడంతో విపరీతంగా మంచు పడుతోంది. దీంతో ప్రజలు హాలిడేను ఎంజాయ్ చేసేందుకు ఇతర ప్రాంతాలకు తరలివెళ్తున్నాయి. అయితే, ఈ సెలవుల వేళ వింటర్ స్టార్మ్ బీభత్సం సృష్టిస్తున్నాయి. అమెరికాలోని ఈశాన్య రాష్ట్రాలను 'డెవిన్' అనే భారీ మంచు తుపాను (ఫ్రశీతీఎ ణవజఱఅ) అతలాకుతలం చేస్తోంది. క్రిస్మస్ పండుగ ముగిసిన వెంటనే విరుచుకుపడటంతో ప్రయాణ వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోయింది.ఈ తుపాను కారణంగా దాదాపు 1,800కిపైగా విమానాలు రద్దయ్యాయి . 10 వేల విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి.




ఫ్లైట్ ట్రాకింగ్ వెబ్‌సైట్ ప్రకారం.. శుక్రవారం సాయంత్రం 4 గంటల సమయానికి దేశవ్యాప్తంగా 1,802 విమానాలు రద్దుకాగా, 22,349 ఆలస్యంగా నడుస్తున్నాయి. దీంతో న్యూయార్క్‌లోని జాన్ ఎఫ్.కెన్నెడీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు, లాగ్వార్డియా విమానాశ్రయం, డెట్రాయిట్ మెట్రోపాలిటన్ వేన్ కౌంటీ విమానాశ్రయం సహా ఈశాన్య, మిడ్‌వెస్ట్‌లోని విమానాశ్రయాల్లో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.జెట్‌బ్లూ ఎయిర్‌లైన్స్ ఒక్కటే తన షెడ్యూల్‌లో 22 శాతం అంటే సుమారు 225కు పైగా విమానాలను రద్దు చేసింది. ఇతర ప్రధాన విమానయాన సంస్థలు కూడా వందలాది సర్వీసులను నిలిపివేశాయి. డెల్టా ఎయిర్‌లైన్స్ 186 విమానాలను, రిపబ్లిక్ ఎయిర్‌వేస్ 155 విమానాలను, అమెరికన్ ఎయిర్‌లైన్స్ 96, యునైటెడ్ ఎయిర్‌లైన్స్ 82 విమానాలను రద్దు చేసింది.తుపాను ప్రభావం న్యూయార్క్ నగరంతో పాటు లాంగ్ ఐలాండ్, కనెక్టికట్, పెన్సిల్వేనియా, ఉత్తర న్యూజెర్సీ ప్రాంతాలపై అధికంగా ఉంది. జాతీయ వాతావరణ విభాగం (ఎన్‌డబ్ల్యూఎస్) సుమారు 2.3 కోట్ల మందికి వింటర్ స్టార్మ్ హెచ్చరికలు జారీ చేసింది. న్యూయార్క్ నగరంలో 4 నుంచి 8 అంగుళాల మంచు కురుస్తుందని, ఇతర ప్రాంతాల్లో అడుగు వరకు హిమపాతం నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేసింది. ఈశాన్య ప్రాంతంలో చాలా వరకు మంచు, తుపాను హెచ్చరికలు జారీ చేసింది.

# నకిలీ ఏజెంట్ల మాటలు నమ్మకండి

**వీసా దరఖాస్తుదారులకు అమెరికన్ ఎంబసీ హెచ్చరిక**

**న్యూఢిల్లీ-- డిసెంబరు 27 ప్రభ**


మీడియేటర్ల మాటలు నమ్మి మోసపోవద్దని, వీసా దరఖాస్తుదారులకు భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం హెచ్చరికలు జారీ చేసింది. అమెరికా ఆంక్షల నేపథ్యంలో హెచ్-1బీ వీసా ప్రాసెసింగ్, రెన్యువల్స్ ఆలస్యమవుతుండటంపై యూఎస్ ఎంబసీ స్పందించింది. ఈ పరిస్థితిని అవకాశంగా తీసుకొని కొందరు నకిలీ ఏజెంట్లు మోసాలకు పాల్పడుతున్నారని పేర్కొంది. ఎలాంటి జాప్యాలకు తావు లేకుండా వీసా లభించేలా చూస్తామంటూ ఆ నకిలీ ఏజెంట్లు దరఖాస్తుదారుల్ని సంప్రదిస్తున్నారని అప్రమత్తం చేసింది. అలాంటి హామీలను నమ్మొద్దని, దానివల్ల ఆర్థికంగా నష్టం, ప్రయాణ ప్రణాళికల్లో ఇబ్బందులు తలెత్తవచ్చని ఎక్స్ వేదికగా అడ్వైజరీ జారీ చేసింది. వీసా అపాయింట్‌మెంట్లు అధికారిక వెబ్‌సైట్ల ద్వారానే షెడ్యూల్ అవుతాయని స్పష్టం చేసింది. ఈ ప్రక్రియ ద్వారా కాకుండా ఇతర మార్గాల్లో ఎవరైనా వీసా ఇప్పిస్తామంటే అది మోసం కిందికే వస్తుందని హెచ్చరించింది. అధికారిక ప్రక్రియలో భాగంగా పేర్కొన్న ఫీజు కంటే ఎక్కువ మొత్తం చెల్లించాల్సిన అవసరం లేదని సూచించింది. అమెరికా తీసుకొచ్చిన కొత్త సోషల్ మీడియా వెట్టింగ్ పాలసీ కారణంగా భారత హెచ్-1బీ దరఖాస్తుదారులు ఇబ్బంది పడుతోన్న సంగతి తెలిసిందే. దాని కారణంగా కొన్ని నెలల పాటు వీసా ఇంటర్వ్యూలు వాయిదా పడ్డాయి. ఈ వ్యవహారంపై మన దేశం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ అంశంపై అమెరికా వర్గాలతో చర్చిస్తున్నట్లు విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వెల్లడించిన సంగతి తెలిసిందే.




# ఢిల్లీలో వెరీ పూర్ కేటరిగీలో గాలి నాణ్యత..

**న్యూఢిల్లీ-- డిసెంబరు 27 ప్రభ**

దేశ రాజధాని ఢిల్లీలో గాలి కాలుష్యం తీవ్రంగా ఉంది. ఏక్యూఐ లెవెల్స్ రోజురోజుకూ ప్రమాదకరస్థాయిలోనే నమోదవుతున్నాయి. తాజాగా శనివారం ఉదయం కూడా ఢిల్లీలో వాయు కాలుష్యం వెరీ పూర్ కేటగిరీలో నమోదైంది. నగరంలో శనివారం ఓవరాల్ ఏక్యూఐ లెవెల్స్ 355గా నమోదయ్యాయి. నగరాన్ని ప్రమాదకరమైన పొగమంచు కమ్మేసింది.సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రకారం.. నగరంలో ఉదయం 9 గంటల సమయానికి గాలి నాణ్యత సూచిక 355గా నమోదైంది. కొన్ని ప్రాంతాల్లో 400కిపైగా నమోదయ్యాయి. ఆనంద్ విహార్‌లో 410, జహన్‌గిరిపురిలో 414, నరేలా ప్రాంతంలో 406, రోహిణి ప్రాంతంలో 406, షాదిపూర్ ప్రాంతంలో 408గా ఏక్యూఐ నమోదైంది. వీటితోపాటూ పలు ప్రాంతాల్లోనూ గాలి నాణ్యత అధ్వానస్థాయిలో నమోదైంది. దీనికితోడు నగరాన్ని దట్టమైన పొగమంచు కమ్మేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.సీజేఐ ఆందోళన.. మరోవైపు రాజధాని ప్రాంతంలో తీవ్ర కాలుష్యంపై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ కాలుష్య సంక్షోభానికి పర్యావరణ నిపుణులు సమర్థవంతమైన పరిష్కారాన్ని కొనుగొంటారని విశ్వాసం వ్యక్తం చేశారు. 'ఢిల్లీని పీడిస్తున్న వాయు కాలుష్య సమస్యను నివారించడానికి స్వల్పకాలిక ఉపశమనం కలిగించే విధానాల కంటే.. దీర్ఘకాలిక పరిష్కారం కోసం చర్యలు అవసరం. ప్రజారోగ్యానికి పెద్ద సవాలుగా మారుతున్న ఈ వాయు కాలుష్య సమస్యకు నిపుణులు పరిష్కారం కనుగొంటారని నాకు నమ్మకం ఉంది' అని అన్నారు.



## సంపాదకీయం

# హిందువులు లక్ష్యంగా బంగ్లాలో దాడులు !



బంగ్లాదేశ్‌లో అల్లర్లు భారత్‌ను రెచ్చగొట్టేలా సాగుతున్నాయా అన్న అనుమానం కలుగుతోంది. ఎందుకంటే యూనస్ తాత్కాలిక నేతగా పగ్గాలు చేపట్టిన తరవాత హిందువులు లక్ష్యంగా దాడులు పెరిగాయి. హసీనాను పదవీచ్యుతి చేసిన తరవాత హిందువులు లక్ష్యంగా దాడులు సాగుతున్నాయి. ఈ క్రమంలో ఇప్పటికే వందలమందిని హతమార్చారు. హసీనా భారత్‌లో తలదాచుకుంటున్న నేపథ్యంలో కావాలనే అక్కడి మైనార్టీ హిందువులపై దాడులు విపరీతం అయ్యాయి. రాజకీయ హింసలో భాగంగా వీటిని చూపే ప్రయత్నం చేసి తప్పించుకోవాలని చూస్తున్నారు. అయితే గత ఏడాదిగా అక్కడ జరుగుతున్న అల్లర్లు కేవలం హిందువులను ఊచకోత కోసేవిగా ఉన్నాయి. పనిగట్టుకుని మూకలు రెచ్చిపోతున్నా, తాత్కాలిక ప్రభుత్వం ప్రేక్షకపాత్ర వహిస్తోంది. ఈ క్రమంలో తాజాగా ఇద్దరు హిందువులను హతమర్చారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దారుణాలపై భారతదేశంలో ఆగ్రహ జ్వాలలు వ్యక్తమవు తున్నాయి. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న మూక దాడులను, హత్యలను సినీ ప్రముఖులు ఖండిస్తున్నారు. గాజాలో జరిగిన పరిణామాలను అయ్యో పాపం అనుకున్న భారతీయులు, పొరుగు దేశం బంగ్లదేశ్‌లో జరుగుతున్న పరిణామాలపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా మౌనం వీడాలంటూ సోషల్ మీడియా వేదికగా కోరుతున్నారు. ఈ క్రమంలోనే హీరోయిన్లు జాన్వీపూర్, కాజల్ అగర్వాల్, సీనియర్ నటి, మాజీ ఎంపీ జయప్రద చేసిన పోస్టులు వైరల్‌గా మారాయి. బంగ్లాదేశ్‌లో రాజకీయ అనిశ్చితి కారణంగా ఆ దేశం రణరంగంగా మారిన సంగతి తెలిసిందే. అక్కడ ఇటీవల హిందువులపై వరుస దాడులు జరుగుతున్నాయి. తొలుత దీపుచంద్ర దాస్ అనే వ్యక్తిని దారుణంగా కొట్టి చంపి, అతని మృతదేహానికి నిప్పంటించిన ఘటన మురువకముందే తాజాగా మరో వ్యక్తిని కొట్టి చంపిన సంఘటన జరిగింది. అమృత్ మండల్ అలియాస్ సామ్రాట్ అనే వ్యక్తి రాజ్‌బరిలోని పంగ్సా ఉప జిల్లాలో హత్యకు గురయ్యాడు. సామ్రాట్ హత్య ఏ విధంగానూ మతపరమైనది కాదని ప్రాథమిక దర్యాప్తులో తేలిందని బంగ్లాదేశ్ ప్రభుత్వం ఓ ప్రకటనలో పేర్కొంది. ఇది కేవలం హత్యను కప్పిపుచ్చుకోవడానికి చేసిన ప్రయత్నం తప్ప మరోటి కాదు. అయితే హిందువులపై జరుగుతున్న వరుస దాడులపై భారత్ తీవ్రంగా స్పందించింది. మైనారిటీ కమ్యూనిటీ సభ్యులను లక్ష్యంగా చేసుకుని ఇటీవల జరిగిన వరుస సంఘటనలను ఆందోళన కలిగించేవిగా అభివర్ణించింది. హిందువులపై ఇలాంటి హింసను విస్మరించలేమని భారత్ హెచ్చరించింది. సరిహద్దు వెంబడి జరుగుతున్న పరిణామాలను న్యూఢిల్లీ తీవ్రంగా పరిగణించిందని కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు. హిందువులపై జరుగుతున్న హింసను విదేశాంగ మంత్రిత్వ శాఖ ఖండించింది. బాధ్యులను గుర్తించి శిక్షిస్తారని ఆశాభావం వ్యక్తం చేసింది. బంగ్లాదేశ్‌లో ఇటీవలి పరిణామాల గురించి ప్రపంచమంతా గమనిస్తోంది. వాటిని నిశితంగా గమనిస్తున్నట్లు భారత్ కూడా పేర్కొంది. శాంతిభద్రతల పరిస్థితి విషయానికొస్తే అక్కడ ఏం జరుగుతుందో ఎప్పటి కప్పుడు భారత్ తెలియజేస్తున్నది. బంగ్లాదేశ్‌లోని హిందువులు, క్రైస్తవులు, బౌద్ధులు సహా మైనారిటీలపై జరుగుతున్న దాడులు ఆందోళన కలిగించే విషయమని జైస్వాల్ అన్నారు. మైమెన్‌సింగ్‌లో ఇటీవల జరిగిన హిందూ యువకుడి దారుణ హత్యను ఖండిస్తున్నామని అన్నారు. ఈ నేరానికి పాల్పడిన వారిని చట్టం ముందు నిలబెట్టాలని ఆశిస్తున్నాం. తాత్కాలిక ప్రభుత్వ హయాంలో హత్యలు, దహనాలు, భూ కబ్జాలతో సహా మైనారిటీలపై 2,900 కంటే ఎక్కువ హింసాత్మక సంఘటనలు జరిగినట్లు స్వతంత్ర వర్గాలు నమోదు చేశాయి. ఈ సంఘటనలను కేవలం రాజకీయ హింసగా తోసిపుచ్చలేమని పేర్కొన్నారు. బంగ్లాదేశ్‌లో ఇద్దరు హిందూ వ్యక్తులను కొట్టి చంపిన నేపథ్యంలో భారత్ ఈ వ్యాఖ్యలు చేసింది. అయితే ప్రపంచవ్యాప్తంగానిరసలు వస్తున్నా బంగ్లాదేశ్‌లో ముస్లిమేతరులు సహా పలువురి మీద జరుగుతున్న దాడులపై ప్రకంపనలు ఆగడం లేదు. విప్లవవాద నాయకుడు షరీఫ్ ఒస్మాన్ హాదీ హత్యను నిరసిస్తూ అతని మద్దతుదారులు శుక్రవారం ఢాకాలోని కీలక కూడలిని దిగ్బంధం చేశారు. న్యాయం చేయాలని నినదిస్తూ బైఠాయించడంతో ట్రాఫిక్ గంటలతరబడి నిలిచిపోయింది. ఢాకా విశ్వవిద్యాలయ మసీదు నుంచి షాబాగ్ వరకు ప్రదర్శన చేపట్టి ధర్నా నిర్వహించారు. న్యాయం జరిగేవరకు పోరాటం కొనసాగుతుందని ప్రకటించారు. హాదీ హత్యానంతరం చెలరేగిన అల్లర్లు, విధ్వంసకాండలో హిందూ కార్మికుడు దీపూ చంద్రదాస్ ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. మరోవైపు.. బ్రిటన్‌లోని ప్రవాసం వీడి 17 ఏళ్ల తర్వాత స్వదేశానికి చేరుకున్న బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ తాత్కాలిక ఛైర్మన్ తారిఖ్ రహ్మాన్ తన తండ్రి, బంగ్లా మాజీ అధ్యక్షుడు జియాఉర్ రహ్మాన్ సమాధిని సందర్శించి నివాళులర్పించారు. 19 ఏళ్ల తర్వాత ఈ సమాధి వద్దకు రాగలగడంపై ఉద్వేగానికి లోనై కన్నీళ్లు పెట్టుకున్నారు. బంగ్లాదేశ్‌లో హిందూ మైనారిటీ లపై దాడుల్ని కేంద్ర మాజీమంత్రి మీనాక్షీ లేఖి ఖండించారు. బంగ్లాదేశ్, పాకిస్థాన్‌లలో ఇంకా కొందరు నేతలు మొగల్ చక్రవర్తి బాబర్ మాదిరి ఆలోచనాధోరణితో ఉన్నారని విమర్శించారు. అందుకే ఆ రెండు దేశాల్లో హత్యలు జరుగుతున్నాయన్నారు. భారత్‌ను రెచ్చగొట్టాలనేదే వారి ఉద్దేశమని ఆరోపించారు.

# వెచ్చదనం కోసం మంట రాజేసి నిద్రించిన కుటుంబం.. నలుగురు మృతి

**పాట్నా:- - డిసెంబరు 27 ప్రభ**

చలికాలం నేపథ్యంలో గదిలో వెచ్చదనం కోసం మంట రాజేసి ఒక కుటుంబం నిద్రించింది. విష వాయువులు వెలువడంతో ఒక వృద్ధురాలు, ముగ్గురు పిల్లలు మరణించారు. మరో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నది. బీహార్‌లోని చాప్రా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. చాప్రాకు చెందిన ఒక కుటుంబం గురువారం రాత్రి వేళ గదిలో వెచ్చదనం కోసం బొగ్గుల కుంపటి వెలిగించారు. తలుపులు, కిటికీలు మూసేశారు. ఎనిమిది మంది కుటుంబ సభ్యులు ఆ గదిలో నిద్రించారు. కాగా, బొగ్గుల కుంపటి మండటంతో ఆ గదిలో ఆక్సిజన్ స్థాయిలు పడిపోయాయి. విషపూరిత కార్బన్ మోనాక్సైడ్ పేరుకుపోయింది. దీంతో ఆ గదిలో నిద్రించిన ఎనిమిది మంది స్పృహ కోల్పోయారు. శుక్రవారం తెల్లవారుజామున కింది అంతస్తులో నివసించే బంధువులు పైకి వెళ్లి చూశారు. ఆ గదిలో ఉన్న వారి పరిస్థితి చూసి ఆందోళన



చెందారు. మరోవైపు వారిని వెంటనే ఆసుపత్రికి తరలించారు. మూడేళ్ల తేజాంష్ కుమార్, ఏడు నెలల గుడియా కుమారి, ఆదియా కుమారి, 70 ఏళ్ల కమలావతి దేవి అప్పటికే మరణినంచినట్లు డాక్టర్లు నిర్ధారించారు. 25 ఏళ్ల ఆర్య కుమారి, 24 ఏళ్ల ఆర్య సింగ్, 25 ఏళ్ల అనిషా, 35 ఏళ్ల అమిత్ అలియాస్ సోనుకు ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. వారి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు డాక్టర్లు తెలిపారు. కాగా, ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆసుపత్రికి చేరుకున్నారు. ఆ తర్వాత బొగ్గుల కుంపటి ఉంచిన గదిని పరిశీలించారు. ఫోరెన్సిక్ బృందాన్ని పంపి ఆధారాలు సేకరించారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు. మరోవైపు శీతాకాలంలో మూసి ఉన్న బెడ్ రూముల్లో బ్రజియర్లు, హీటర్లు, బ్లోయర్‌లను ఉపయోగించవద్దని ఆ జిల్లా అధికారులు సూచించారు. నిద్రించే గదిలో సరైన వెంటిలేషన్ ఉండేలా చూసుకోవాలని కోరారు. తద్వారా ఇలాంటి ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొన్నారు.

# న్యూఇయర్ వేడుకలకు ముందు ఢిల్లీ పోలీసులు ఆఘట్ ఆపరేషన్

## 900 మందికి పైగా అరెస్టు

**న్యూఢిల్లీ - డిసెంబరు 27 ప్రభ**

నూతన సంవత్సర వేడుకలకు ముందు ఆగ్నేయ ఢిల్లీలో ఆఘట్ 3.0 పేరుతో నిర్వహించిన ఈ ఆపరేషన్‌లో ఢిల్లీ పోలీసులు 966 మందిని పట్టుకున్నారు. అలాగే ఆయుధాలు, మాదకద్రవ్యాలు, అక్రమ మద్యం, వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు శనివారం అధికారులు వెల్లడించారు. సంవత్సరం ముగింపు.. న్యూఇయర్ వేడుకల సందర్భంగా వీధి నేరాలు, నేరస్తుల కార్యకలాపాలను అరికట్టడానికి పోలీసులు ఈ ఆపరేషన్‌ను నిర్వహించారు. ఢిల్లీ ఎక్సైజ్ చట్టం, ఎన్‌డిపిఎస్ చట్టం కింద మొత్తం 331 మందిని పోలీసులు అరెస్టు చేశారు. ప్రజా జూదం చట్టం ప్రకారం, వివిధ నివారణ నిబంధనల కింద 504




మందిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ చర్యలో భాగంగా పోలీసులు చెడు ప్రవర్తన కలిగిన వారిని 116 మందిని, ఐదుగురు ఆటో లిఫ్టర్లను, నలుగురు ప్రకటిత నేరస్తులను అరెస్టు చేసినట్లు పోలీసు అధికారులు తెలిపారు. కాగా, ఆఘట్ ఆపరేషన్‌లో ఆయుధ చట్టం కింద 21 దేశీయంగా తయారు చేసిన తుపాకులు, 20 లైవ్ కార్ట్రిడ్జ్‌లు, 27 కత్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 12,258 క్వార్టర్ల అక్రమ మద్యాన్ని కూడా స్వాధీనం చేసుకున్నారు. 6.01 కేజీల గంజాయి, జూదగాళ్ల నుండి 2.36 లక్షల డబ్బును, 310 మొబైల్ ఫోన్లను, ఆరు ద్విచక్ర వాహనాలు, నాలుగు చక్రాల వాహనాన్ని కూడా స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అదనంగా ఢిల్లీ పోలీసు చట్టం కింద 1,306 మందిపై చర్యలు తీసుకున్నారు. నిబంధనల్ని అతిక్రమించినందు వలన 231 ద్విచక్రవాహనాలను సైతం స్వాధీనం చేసుకున్నారు. భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్) 111, 112 సెక్షన్ల కింద నేరస్తులపై కేసులు పెట్టడం జరుగుతుందని అధికారులు తెలిపారు.

# ఏజపాన్‌లో ఢీకొన్న50 వాహనాలు

**17 వాహనాలకు వ్యాపించిన మంటలు..**
**ఒకరు మృతి,26 మందికి గాయాలు**

**గున్మా- -**
**డిసెంబరు 27 ప్రభ**



జపాన్‌లోని గున్మా ప్రిఫెక్చర్‌లోని మినాకామి పట్టణం సమీపంలో కన్-ఎత్సు ఎక్స్‌ప్రెస్‌వేపై శుక్రవారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. భారీ హిమపాతం, రోడ్డుపై గడ్డకట్టిన మంచు కారణంగా 50కి పైగా వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఒకరు మృతిచెందగా, మరో 26 మంది గాయపడ్డారు. ప్రమాదం తర్వాత భారీ అగ్నిప్రమాదం సంభవించి, అనేక వాహనాలు కాలి బూడిదయ్యాయి. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, శుక్రవారం రాత్రి 7:30 గంటల సమయంలో భారీగా కురుస్తున్న మంచు కారణంగా తొలుత రెండు ట్రక్కులు ఢకొన్నాయి. రోడ్డుపై ఐస్ గడ్డకట్టి ఉండటంతో, వాటి వెనుక వస్తున్న వాహనాలు బ్రేకులు వేయలేక ఒకదాని వెనుక ఒకటి ఢీకొంటూ వెళ్లాయి. క్షణాల్లోనే 50కి పైగా వాహనాలు ప్రమాదంలో చిక్కుకున్నాయి. ప్రమాదం జరిగిన కొద్దిసేపటికే కొన్ని వాహనాల్లో మంటలు చెలరేగి, సుమారు 17 వాహనాలకు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సుమారు ఏడున్నర గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో టోక్యోకు చెందిన 77 ఏళ్ల మహిళ మరణించినట్లు పోలీసులు ధ్రువీకరించారు. గాయపడిన 26 మందిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు.

# మోడీని, ఆర్ఎస్ఎస్‌ని ప్రశంసించిన దిగ్విజయ్ సింగ్

**న్యూఢిల్లీ : -**
**- డిసెంబరు 27 ప్రభ**




ప్రధాని మోడీని, ఆయన వెనుకున్న ఆర్ఎస్ఎస్‌ను కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ ప్రశంసిస్తూ శనివారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. శనివారం ఢిల్లీలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సిడబ్ల్యుసి) సమావేశం జరుగుతున్న వేళ దిగ్విజరు సింగ్ చేసిన ఈ పోస్టు రాజకీయంగా తీవ్ర దుమారం రేపింది. దిగ్విజయ్ పోస్టు చేసిన ఫోటోలో.. బీజేపీ నేత ఎల్‌కే అద్వానీతో పాటు మోడీ కూడా ఉన్నారు. అద్వానీ కుర్చీలో కూర్చుంటే.. ఆయన ముందు నేలపై మోడీ కూర్చున్నారు. బ్లాక్ అండ్ వైట్‌లో ఉన్న ఆ ఫోటోను దిగ్విజయ్ ట్వీట్ చేశారు. ఈ ఫొటోకి జతగా తాను ఖోరా సైట్‌లో ఆసక్తికరమైన ఫొటోని కనుగొన్నానని, అట్టడుగు స్థాయిలో పనిచేసే ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు, జన్ సంఘ్ నేతలు ఫోటోలో ఉన్నారని, నేలపై కూర్చున్న వ్యక్తి ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి అయ్యారని ఇది ఆ సంస్థ శక్తి అని, జై సియా రామ్ అంటూ దిగ్విజరు సింగ్ పోస్టు చేశారు. అయితే ఆ ఫోటోను 1996లో తీసినట్లు తెలుస్తోంది. గుజరాత్ సీఎంగా శంకర్ సింగ్ వాఘేలా ప్రమాణ స్వీకారం చేస్తున్న సమయంలో ఆ ఫోటో తీసినట్లు భావిస్తున్నారు. కాంగ్రెస్ నాయకత్వంలో ఉన్న నియంతృత్వ, అప్రజాస్వామిక విధానాలను దిగ్విజరు ఎక్స్‌పోజ్ చేశారని బీజేపీ నేత సీఆర్ కేశవన్ ఆరోపించారు. ప్రస్తుతం దిగ్విజయ్ సింగ్ చేసిన పోస్టు చర్చకు దారితీసింది.

# కుటుంబ సభ్యులపైనే ఉగ్ర బెదిరింపులు..

**న్యూఢిల్లీ : - డిసెంబరు 27 ప్రభ**

అమెరికాలో భారత సంతతికి చెందిన ఓ విద్యార్థి అరెస్ట్ అయ్యాడు. కుటుంబ సభ్యులపైనే పలుమార్లు దాడికి పాల్పడటంతోపాటూ.. సొంత ఇంటికి నిప్పు పెట్టేందుకు ప్రయత్నించడంతో అతడిని అదుపులోకి తీసుకున్నారు డల్లాస్ లోని టెక్సాస్ విశ్వవిద్యాలయంలో చదువుతోన్న 22 ఏండ్ల భారత సంతతికి చెందిన విద్యార్థి మనోజ్ సాయి లెల్లా.. తరచూ కుటుంబ



సభ్యులపై ఉగ్ర బెదిరింపులకు దిగుతూ, దాడి చేస్తున్నాడు. అంతేకాదు ఇంటికి కూడా నిప్పు పెట్టేందుకు ప్రయత్నించాడు. దీంతో మనోజ్‌పై కుటుంబ సభ్యులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు మనోజ్ సాయి లెల్లాను ఫ్రిస్కో పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే, మనోజ్ గత కొన్ని రోజులుగా మానసిక సమస్యలతో బాధపడుతున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ మేరకు దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు.

# జర్నలిస్టుల హక్కులను కాలరాస్తున్న జీవో 252 ను సవరించాలి..

- జిల్లా అధ్యక్షులు బొమ్మ అమరేందర్,
- ఎర్ర యాకన్న, అధ్యక్షులు, ప్రెస్ క్లబ్, కూకట్ పల్లి.హక్కుల సాధన కోసం కదం తొక్కిన మేడ్చల్ జర్నలిస్టులు..!
- జీవో 252 ను వ్యతిరేకిస్తూ మేడ్చల్ కలెక్టరేట్ ముందు టీయూడబ్ల్యూజే (హెచ్ 143) ధర్నా..!
- సమస్యలపై జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి కి వినతిపత్రం..!
- రెండు కార్డుల విధానాన్ని స్వస్తి పలకాలి.. బొమ్మ అమరేందర్ ఉద్దండ వెంకట్, కోల వెంకటేశ్వర్లు.







**మేడ్చల్ జిల్లా, డిసెంబర్ 27, ప్రభ:** ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలిచే జర్నలిస్టుల హక్కులకు భంగం కలిగించే జీఓ నెం.252ను తక్షణమే సవరించాలని టీయూడబ్ల్యూజే మేడ్చల్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కార్యవర్గ బృందం బొమ్మ అమరేందర్ ఉద్దండ వెంకట్, కోల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. తెలంగాణ జర్నలిస్టు ఫోరం, టీయూడబ్ల్యూజే (TUWJ-H-143) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు మేడ్చల్ జిల్లా జర్నలిస్టులతో కలిసి ఆందోళన ధర్నా నిర్వహించారు, ఈ కార్యక్రమానికి మేడ్చల్ జిల్లాలోని, కుత్బుల్లాపూర్ కూకట్పల్లి,మల్కాజ్గిరి మేడ్చల్ ఉప్పల్ నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,అక్రిడేషన్ కార్డులకోత విధించే జీవోలను, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సవరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం జర్నలిస్టుల హక్కులు, ఆత్మగౌరవాన్ని దెబ్బ తీస్తూ 252 జీవో తీసుకురావడం శోచనీయమన్నారు. లోప భూయిష్టమైన ఈ జీవో వల్ల మేడ్చల్ జిల్లా పరిధిలోని నియోజకవర్గ కేంద్రాల్లో, లక్ష జనాభా దాటిన పట్టణాల్లో అక్రిడేషన్ కార్డులకు కోత పడుతుందన్నారు. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు గడుస్తున్నా, ఇప్పటికీ సంక్షేమ పథకాలు అమలు జరగడం లేదన్నారు. కొత్త జీవో వల్ల మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలో అనేకమంది జర్నలిస్టులు అక్రిడిటేషన్లు కోల్పోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. డెస్క్ జర్నలిస్టులకు అక్రిడియేషన్ కార్డులు నిలిచిపోయే ప్రమాదం ఉందన్నారు. గతంలో అమలులో ఉన్న విధానాన్ని కొనసాగించాలని, జీవో 252 జర్నలిస్టుల జీవితాలకు గొడ్డలి పెట్టులాంటిదనీ , దీని వెంటనే సవరించాలని డిమాండ్ చేశారు.పాత జీవో 239 యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు అందించాల్సిన ఆర్టీసీ బస్ పాస్ కు సంబంధించిన స్పష్టమైన గైడ్ లైన్స్ ను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని ఈ సందర్భంగా బొమ్మ అమరేందర్, ఉద్దండ వెంకట్, కోల వెంకటేశ్వర్లు కోరారు.ధర్నా అనంతరం జర్నలిస్టు సమస్యలపై మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి కి వినతిపత్రం సమర్పించారు అక్రిడేషన్ కార్డులతో పాటు జర్నలిస్టుల సమస్యలపై, రాష్ట్ర ప్రభుత్వానికి, మా సమస్యలను పరిష్కరించమని, మీ ద్వారా ప్రభుత్వానికి తెలుపవలసిందిగా వారు కోరారు. మేడ్చల్ జిల్లా జర్నలిస్టులను దృష్టిలో పెట్టుకుని అక్రిడేషన్ల కార్డులను కోత విధించవద్దని కోరగా అదన కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. జర్నలిస్టుల నివాస స్థలాల విషయంలోనూ సాధ్యాసాధ్యాలను కలెక్టర్ కలెక్టర్ తో చర్చించి త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని అదనపు కలెక్టర్ భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర నాయకులు శివాజీ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు సుగ్రీవుడు, మేడ్చల్ జిల్లా స్టాపర్స్, మేడ్చల్ జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు, రవిచంద్ర (దిశ,) , రామారావు (నమస్తే తెలంగాణ) , హనుమంత రెడ్డి (విజయ క్రాంతి), రచ్చ శ్రీనివాస్ (ఆంధ్రప్రభ),, భరత్ కళ్యాణ్ (జనం సాక్షి), కుత్బుల్లాపూర్ ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు కార్యదర్శులు సుధీర్ మంకాల, కృష్ణారెడ్డి, కూకట్పల్లి అధ్యక్ష కార్యదర్శులు యాకయ్య నాగరాజు మల్కాజ్గిరి ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు , బండారి జార్జ్ విల్సన్, గిరి గౌడ్ కాప్రా ప్రెస్ క్లబ్ కాప్రా ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి దొమ్మటి,కిరణ్ కుమార్, జవహర్ నగర్ ప్రెస్ క్లబ్ జవహర్ నగర్ ప్రెస్ క్లబ్, జవహర్ నగర్ ప్రెస్ క్లబ్ కీసర ప్రెస్ క్లబ్ కీసర ప్రెస్ క్లబ్ మేడ్చల్ ప్రెస్ క్లబ్ షామీర్పేట్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు రమేష్ నేత, అల్వాల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు సుక్క రవి అల్వాల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు సుక్క రవి, మేడిపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు, సోమయ్య నాగభూషణ చారి,నవీన్ కుమార్, మల్కాజ్గిరి పార్లమెంట్ అధ్యక్షులు మురళి యాదవ్, జిల్లా నియోజకవర్గ నాయకులు,, అక్కల రాజు గౌడ్, పాండుగౌడ్ రాయుడు, నమస్తే తెలంగాణ బాపు కొలిపాక వెంకట్, బాన్సువాడ వెంకట్ ఎర్రోళ్ల బాబు ఎర్రోళ్ల కృష్ణ ఎర్రం పెంటయ్య వీరేడ్ శివకుమార్ పిట్ల శివకుమార్ పక్కనే పాండురంగం బిక్షపతి యాకూబ్ శ్రీనివాస్ ప్రసాద్,, రామకృష్ణ, బబ్బి కాంత్, జవహర్ నగర్ నాయకులు, గుమ్మడి వెల్లి సత్యనారాయణ, పోరండ్ల యాదగిరి, పెద్ది రమేష్,తుని రమేష్ చారి, తుటి శ్రీనివాస్ వెంకటకృష్ణ, లక్ష్మణ్, మధు, ప్రశాంత్ నరేష్ చారి, రాము పురేందర్ శ్రీధర్, పందిరి శ్రీనివాసులు, కిట్టు వంశీ, రాజు రాజేందర్ కుమార్, నాగేందర్ అబ్దుల్, మల్లేష్ నర్ర శ్రీనివాసరెడ్డి శివకుమార్, సందీప్ శ్రీనివాస్, కనకయ్య, వెంకట్ కుమారస్వామి, నరేష్ జి ఎన్ కిషోర్ మంద స్వామి దాస్, నవీన్ చారి అరుణ్ శ్రీధర్ మే రోజు రామబ్రహ్మం బుచ్చిరెడ్డి మల్లేష్ గౌడ్ రఘు,,యూనియన్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

# ఆమనగల్లును ఉత్తమ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుకుందాం అని బిఆర్ఎస్ పిలుపు






**ఆమనగల్, డిసెంబర్ 27, ప్రభ:** ఆమనగల్ మునిసిపాలిటీ లో శనివారం నాడు బిఆర్ఎస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు డాక్టర్ పత్యా నాయక్ బిఆర్ ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి 6 వార్డు లో" బస్తీ బాట "కార్యక్రమం నిర్వహించారు. గుర్రం గుట్ట కాలనీలో పలు సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారు. ఆ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలు కాలనీల సమస్యలు నెరవేరాలన్న ఆమనగల్లు మున్సిపాలిటీ అభివృద్ధి చెందాలన్న బీఆర్ఎస్ పార్టీ మునిసిపాలిటీలో అధికారంలోకి రావాలని పత్య నాయక్ పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికలలో దీ=హా పార్టీకి పూర్తి మెజారిటీనివ్వాలన్నారు. తద్వారా మున్సిపాలిటీలోని అన్ని వార్డులలో ఉన్న సమస్యలను పరిష్కరించుకొని ఆమనగల్లు మునిసిపాలిటీని అభివృద్ధి పరుచుకుందామని ఈ సందర్భంగా బస్తీ బాటలో పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు యంగలి రఘు, నాగిళ్ల జగన్ ,ఎనుముల రమేష్, వడ్డే వెంకటేష్ వరికుప్పల గణేష్ ,కొమ్ము ప్రసాద్,, తోట కృష్ణ యాదవ్, రమేష్ నాయక్, గుద్దేటి మహేష్ నేత, చాంద్ పాషా, నిరంజన్, జంతుక కిరణ్ ,లలితమ్మ, విమలమ్మ శంకర్ నాయక్ మరియు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# నూతనంగా ఎన్నుకోబడ్డ ముదిరాజ్ సర్పంచులను సన్మానించిన

- మిడ్జిల్ సర్పంచ్ ఎడ్ల శంకర్ ముదిరాజ్




మిడ్జిల్ సర్పంచ్ ఎడ్ల.శంకర్ ముదిరాజ్

**మిడ్జిల్, డిసెంబర్ 27, ప్రభ:** జడ్చర్ల నియోజకవర్గం లో నూతనంగా ఎన్నుకోబడ్డ ముదిరాజ్ సర్పంచులను ఉప్పసర్పంచులు మరియు వార్డు మెంబర్లు జడ్చర్ల మండలం లోని బూరెడ్డిపల్లి గ్రామంలో గల చెన్నారెడ్డి ఫంక్షన్ లో సన్మాన కార్యక్రమంను ఏర్పాటు చేసిన జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ నూతనంగా ఎన్నుకోబడ్డ సర్పంచులను ఉపసర్పంచ్ లను వార్డు మెంబర్ లను సన్మానించారు ఈ కార్యక్రమంలో తెలంగాణ మనముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు చూప్పరి శంకర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందే బాబన్నగారు మరియు మహబూబ్ నగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజు తదితరులు పాల్గొన్నారు.

# జనవరి 18 -2026 ఖమ్మం పట్టణ కేంద్రంలో జరగబోయే సిపిఐ 100 వందేళ్ళ సంబరాలకు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయండి




- సిపిఐ జిల్లా కార్యదర్శి బృంగి బాలకిషన్




**మిడ్జిల్, డిసెంబర్ 27, ప్రభ:** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ డిసెంబర్ 26-2025 నాటికి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జడ్చర్ల మండలంలోని నసురుల్లాబాద్ గ్రామ శాఖ ఆధ్వర్యంలో జెండా ఎగరేసి అనంతరం మాట్లాడుతూ ఖమ్మం పట్టణ కేంద్రంలో జనవరి 18 తారీఖున ఐదు లక్షల జనాభాతో దేశంలోని అన్ని రాష్ట్రాలలో ప్రతినిధులతో పాటు 40 దేశాల అతిథులు కూడా పాల్గొంటారని తెలిపారు భారత దేశంలో సిపిఐ పార్టీ ఆవిర్భావం నుంచి ఎంతోమంది ప్రాణాలు త్యాగం చేసి పేద ప్రజల హక్కుల కోసం కార్మికుల చట్టాల గురించి స్వాతంత్ర ఉద్యమంలో ముందు బాగానే ఉండి అనేక ప్రత్యక్ష పోరాటంలో పాల్గొన్న ఘన చరిత్ర సిపిఐ పార్టీది ఈ పోరాటాల చరిత్రను భవిష్యత్ తరాలకు అందిస్తూ రాబోయే కాలంలో దేశంలో అన్ని కమ్యూనిస్టు పార్టీలను ఏకం చేస్తూ గత పోరాటాల స్పూర్తితో భవిష్యత్తులో ప్రజా సంఘాల నిర్మాణం ప్రజా పోరాటాలు నిర్వహిస్తామని జనవరి 18 2026 ఖమ్మం పట్టణ కే ద్రంలో జరిగే భారీ బహిరంగ సభకు మహబూబ్నగర్ జిల్లా నుంచి అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బాగి కృష్ణయ్య నస్రుల్లాబాద్ గ్రామ సర్పంచి నిర్మల బాలస్వామి గారు ఉప సర్పంచ్ లక్ష్మణ్ . యువజన సంఘం నాయకులు మహేష్ నస్రుల్లాబాద్ గ్రామ శాఖ కార్యదర్శి. శ్రీశైలం ఆంజనేయులు. లక్ష్మణ్.శ్రీను వెంకటస్వామి. లక్కీ. గౌరమ్మ. బాలస్వామి. వికీస్ తదితరులు పాల్గొన్నారు

# వరంగల్ లో ఉచిత కృతిమ కాళ్ల పంపిణీ శిబిరం ప్రారంభించిన మంత్రి కొండ సురేఖ



**వరంగల్, డిసెంబర్ 27 ప్రభ:** వరంగల్ నగరంలోని కొత్తవాడ ప్రాంతంలోని పద్మశాలి వెల్ఫేర్ ట్రస్ట్ ఫంక్షన్ హాల్ లో ఉచిత కృత్రిమ కాళ్ల పంపిణీ శిబిరాన్ని రాష్ట్ర దేవాదాయ, అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వికలాంగులపునరావాసం ,స్వాలంబనకు ఇటువంటి సేవా కార్యక్రమంలో ఎంతో దోహదపడతాయని అన్నారు. ప్రభుత్వం తో పాటు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గుండు సుధారాణి, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద దేవి , అధికారులు నాయకులు పాల్గొన్నారు.

# నూతన సర్పంచులు విధుల నిర్వహణ

- మొదలైన అభివృద్ధి పనులు



**తిరుమలగిరి సాగర్, డిసెంబర్ 27 ప్రభ:** నల్గొండ జిల్లా, తిరుమలగిరి సాగర్ మండలం, జాల్ తండా గ్రామ పంచాయతీ లో నూతన సర్పంచిగా బాధ్యతలు చేపట్టిన జాటావత్ బామిని శర్మన్ నాయక్ గ్రామం చివరి నుంచి ఊరి లోపల కరెంట్ స్తంభాలలు వీధి దీపాలు, ముళ్ల చెట్ల తొలగింపు, అడ్డుగా ఉన్న చెడు వ్యర్థలను క్లీన్ చేయించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, మోతిలాల్, వార్డు సభ్యులు, మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల నూతన అక్రిడేషన్లకు సంబంధించిన జీవో 252 ను సవరించాలని కోరుతూ వరంగల్, హనుమకొండ కలెక్టరేట్ల ముందు జర్నలిస్టుల ధర్నా



**వరంగల్ ,డిసెంబర్ 27 ప్రభ:** తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు వరంగల్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు జర్నలిస్టులు నూతన అక్రిడేషన్లకు సంబంధించిన జీవో 252ను సవరించాలని కోరుతూ నిరసన చేపట్టారు. అలాగే హనుమకొండ కలెక్టరేట్ కార్యాలయం ముందు తెలంగాణ యూనియన్ వర్కింగ్ జర్నలిస్ట్ ఆధ్వర్యంలో శనివారం ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 252నిరసిస్తూ నిరసన చేపట్టారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుకు అన్యాయం చేసేందుకు ఇలాంటి జీవోలు విడుదల చేస్తున్నారని ఆరోపించారు . ఈ సందర్భంగా కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని పలువురు జర్నలిస్టులు యూనియన్ నాయకులు ధర్నాలో పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధికి ప్రాధాన్యత

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**వరంగల్, డిసెంబర్ 27 ప్రభ:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో 5 కోట్ల పైచిలుకు నిధులు కేటాయించామని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు. నగరంలో ప్రధాన సమస్యలైన రోడ్ల నిర్మాణాన్ని చేపట్టామని ఆయన పేర్కొన్నారు. శనివారం వరంగల్ నగరంలోని టీచర్స్ కాలనీ, వాజ్ పాల్ కాలనీలో రూ 65 లక్షల నిధులతో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అభివృద్ధి పనులను ఏబీసీ కేటగిరీలలో అత్యవసరం ఉన్నచోట నుంచి తొలి ప్రాధాన్యతగా చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు .ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## మేడారం సమ్మక్క సారలమ్మ ఆర్చి దగ్గర ఏర్పాటు చేసిన చేసిన ప్రతిమలు

- భక్తులను ఆకర్షిస్తున్న వాటర్ ప్లాంట్ రంగురంగుల విద్యుత్ దీపాలు



**వరంగల్, డిసెంబర్ 27 ప్రభ:** ఉమ్మడి వరంగల్ జిల్లా మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర పురస్కరించుకొని తాడ్వాయి లోని సమ్మక్క సారలమ్మ ఆర్చి వద్ద ఏర్పాటు చేసిన ప్రతిమలు ప్రత్యేక ఆకర్షణగా కనిపిస్తున్నాయి. ఆదివాసి నృత్యాలు, డోలు వాయిద్యాలు, బాణాలు విసురుతున్న బొమ్మల వద్ద వనదేవతల దర్శనానికి వచ్చే భక్తులు సెల్ఫీలు దిగుతూ సందడి చేస్తున్నారు. సతీష్ గడ్, ఏపీ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వనదేవతల దర్శనానికి వస్తున్నారు. రాత్రి సమయంలో వాటర్ ఫౌంటెన్, రంగురంగుల విద్యుత్ కాంతులతో భక్తులను , పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి.

## కుటుంబ సభ్యులు పరామర్శించిన మున్సిపాలిటీ మాజీ ఫ్లోర్ లీడర్ చింతల చంద్రారెడ్డి



**తిరుమలగిరి, డిసెంబర్ 27 ప్రభ:** తిరుమలగిరి సాగర్ మండలం బోయగూడం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు గడ్డం సాగర్ రెడ్డి, గడ్డం నవీన్ రెడ్డి తాతగారు కీర్తి శేషులు గడ్డం అనంత రెడ్డి చిన్న కర్మ సందర్భంగా, ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ మాజీ ఫ్లోర్ లీడర్ చింతల చంద్రారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలోహోలియ మార్కెట్ వైస్ చైర్మన్ కలసాని చంద్రశేఖర్ యాదవ్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# రౌడీ షీటర్లకు బాలానగర్ ఏసీపీ వార్నింగ్: 'బైండోవర్ షరతులు ఉల్లంఘిస్తే జైలుకే





**బాలానగర్ డిసెంబర్ 27,ప్రభ:** శాంతి భద్రతల పరిరక్షణకు సైబరాబాద్ పోలీసులు పటిష్ఠ చర్యలు చేపట్టారు. రానున్న నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో, బాలానగర్ జోన్ పరిధిలో నేర చరిత్ర కలిగిన రౌడీ షీటర్లపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. సైబరాబాద్ సీపీ అవినాష్ మొహంతి ఆదేశాలు, డీసీపీ సురేష్ కుమార్ సూచనల మేరకు శనివారం బాలానగర్ డివిజన్ పరిధిలోని సనత్ నగర్, బాలానగర్ పోలీస్ స్టేషన్లకు చెందిన 23 మంది రౌడీ షీటర్లకు బాలానగర్ ఏసీపీ పింగిలి నరేష్ రెడ్డి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఏసీపీ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డిఐ సక్రమ్ కూడా పాల్గొన్నారు.

**బైండోవర్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు:**

ఈ సందర్భంగా ఏసీపీ పింగిలి నరేష్ రెడ్డి రౌడీ షీటర్లను గట్టిగా హెచ్చరించారు. రౌడీ షీటర్లపై పోలీసు నిఘా నిరంతరం ఉంటుందని స్పష్టం చేశారు. బైండోవర్ అయిన నేరస్థులు ఎవరైనా సరే షరతులను



ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని, జైలుకు పంపడం ఖాయమని నొక్కి చెప్పారు. ఇంకా నేరాలకు పాల్పడిన పునరావృతం చేసినా పీడీ యాక్టును నమోదుచేసి సిపి నుండి నగర బహిష్కరణకు ఉత్తర్వులకు వెనుకాడమని ఏసీపీ తెలిపారు."బైండోవర్ షరతులను ఉల్లంఘించిన రౌడీ షీటర్ అర్జున్ సింగ్‌ను ఇటీవల మిగిలిన బాండ్ఓవర్ కాలం వరకు రిమాండ్‌కు తరలించామన్నారు. ఎవరైనా బైండోవర్ షరతులు ఉల్లంఘిస్తే, మిగిలిన కాలానికి తప్పనిసరిగా జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుంది. అంతేకాక, పాత నేరాలలో పొందిన బెయిల్‌ను కూడా రద్దు చేస్తాం. ప్రజల భద్రతకు విఘాతం కలిగించే వారి పట్ల ఉదారత చూపబోమని," ఏసీపీ నరేష్ రెడ్డి హెచ్చరించారు.

**మంచి నడవడికతో జీవించాలని సూచన:**

గతంలో నేరాలకు పాల్పడిన వారు ఆ ప్రవృత్తిని పూర్తిగా విడిచిపెట్టి, సమాజంలో మంచి నడవడికతో, హుందాగా జీవించాలని ఏసీపీ సూచించారు. వారి భవిష్యత్తును, కుటుంబాల సంతోషాన్ని దృష్టిలో పెట్టుకొని మారాలని పిలుపునిచ్చారు."మంచి ప్రవర్తనతో ఉంటే మీ కుటుంబాలు సంతోషంగా ఉంటాయి. దానితో పాటు సమాజంలో మీకు గౌరవం, గుర్తింపు పెరుగుతాయి," అని రౌడీ షీటర్లకు ఏసీపీ నరేష్ రెడ్డి హితవు పలికారు.

# చైనా మాంజాపై పంజా ప్రజల ప్రాణాల రక్షణకే పోలీసుల చర్యలు

- మహబూబ్‌నగర్ వన్‌టౌన్ పరిధిలో చైనా మాంజా విక్రయాలపై పోలీసుల ఆకస్మిక తనిఖీలు






**మిడ్జిల్, డిసెంబర్ 27, ప్రభ:** మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి. జానకి ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు శనివారంరోజు మహబూబ్‌నగర్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పాన్ చౌరస్తా, మార్కెట్ ఏరియా మరియు రామ మందిర్ కూడళ్లలో వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ అప్పయ్య, ఎస్ఐ సీనయ్య మరియు సిబ్బంది కలిసి "చైనా మాంజాపై పంజా" అనే నినాదంతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైనా మాంజా వల్ల ప్రజలకు, ముఖ్యంగా చిన్నారులు, వాహనదారులు మరియు పక్షులకు ప్రాణాపాయం ఏర్పడుతోందని, గతంలో అనేక ప్రమాదాలు జరిగినట్లు ప్రజలకు వివరించారు. చైనా మాంజా వల్ల గొంతు కోసుకుపోవడం, తీవ్ర గాయాలు కావడం వంటి ప్రమాదాలు జరుగుతున్నాయని తెలియజేశారు. అనంతరం ఇన్స్పెక్టర్ అప్పయ్య వన్‌టౌన్ పరిధిలో చైనా మాంజా అమ్ముతున్న షాపులపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. చైనా మాంజా అమ్మడం, తయారు చేయడం మరియు నిల్వ ఉంచడం చట్ట విరుద్ధమని, నిబంధనలను ఉల్లంఘించిన షాపు యజమానులు మరియు వ్యక్తులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఇకపై చైనా మాంజా విక్రయాలు లేదా వినియోగం చేస్తే కేసులు నమోదు చేయడమే కాకుండా, మాంజాను స్వాధీనం చేసుకొని సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి. జానకి ఐపీఎస్ మాట్లాడుతూ, ప్రజల ప్రాణాల రక్షణే పోలీసుల ప్రధాన లక్ష్యమని, చైనా మాంజా వల్ల జరుగుతున్న ప్రమాదాలను నివారించేందుకు జిల్లావ్యాప్తంగా కఠిన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలు పోలీసులకు పూర్తిగా సహకరించి చైనా మాంజా వినియోగాన్ని పూర్తిగా మానేయాలని, ఎవరైనా చైనా మాంజా అమ్ముతున్నట్లు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ కోరారు.

# ఆదివారం జరగనున్న బీసీ జన భోజనాల మహోత్సవంను విజయవంతం చేయండి

- బీసీ ఉద్యమ నేతల పిలుపు

**ఎల్.బి.నగర్,డిసెంబర్27 ప్రభ:** బీసీల ఐక్యతే బలం రాజ్యాధికారం లక్ష్యం అన్న నినాదంతో నేడు ఆదివారం నిర్వహిస్తున్న బీసీ జన భోజన కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా పలువురు బిసి ఉద్యమ నేతలు పిలుపునిచ్చారు శనివారం నాడు సాయంత్రం ఆటోనగర్ అనన్య రిసార్ట్స్ లో బీసీ భోజన మహోత్సవ ఏర్పాట్లను పలువురు బిసి ఉద్యమ నేతలు పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలువురు బీసీ ఉద్యమ నేతలు మాట్లాడుతూ... బీసీల ఐక్యత చాటడానికే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వారు అన్నారు. బీసీ ఉద్యమాన్ని భవిష్యత్తులో మరింత బలోపేతం చేయడానికి ఈ సందర్భంగా ప్రణాళికలు కూడా రూపొందిస్తామని వారు చెప్పారు ఈ కార్యక్రమానికి పలువురు ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, ఎంపీలు,



ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు, రాష్ట్ర, జాతీయ బీసీ సంఘాల నేతలు ,ఉద్యమ నేతలు హాజరవుతున్నారని తెలిపారు. విలేకరుల సమావేశంలో బీసీ జన భోజననిర్వహణ కమిటీ సభ్యులు కూరెళ్ల వేములయ్య గౌడ్ , బొమ్మ రఘురాం నేత చామకూర రాజు, కేవి గౌడ్ విశ్వనాథులు పుష్పగిరి, దుస్స యాదగిరి నేత,ఎన్ శ్రీనివాస్ గౌడ్ పూల నాగరాజు వంశరాజ్ రామచంద్ర,జే బి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బిజినెస్

# ఒక్కరోజే రూ.11 వేలు పెరిగిన కిలో వెండి ధర..
# -లక్షన్నరకు చేరువలో బంగారం

బంగారం , వెండి ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. వరుసగా రెండో రోజైన శనివారం మరో ఆల్‌టైం హైకి చేరుకున్నాయి. ముఖ్యంగా వెండి ధరలు రాకెట్ వేగంతో దూసుకెళ్తున్నాయి.శనివార ఒక్కరోజే కేజీ వెండిపై రూ.11 వేలు పెరిగి రెండున్నర లక్షలు దాటింది. శనివారం ఉదయం హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో కిలో వెండి ధర రూ.2.51 లక్షలకు చేరింది.అటు బంగారం ధరలు కూడా పెరిగాయి. ఇవాళ హైదరాబాద్ మార్కెట్‌లో 24 క్యారెట్ల పది గ్రాముల స్వచ్ఛమైన బంగారం ధర రూ.1,43,000 పలుకుతోంది. 22 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,32,410కి చేరింది. ప్రధానంగా అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ నెలకొనడంతో ధరలు భారీగా పుంజుకుంటున్నాయని ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ వెల్లడించింది.ఈ ఏడాది ఇప్పటి వరకు తులం బంగారం రూ.63,350 లేదా 80.24




శాతం పెరిగింది. డిసెంబర్ 31, 2024న ధర రూ.78,950గా ఉన్నది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 50.87 డాలర్లు లేదా 1.13 శాతం ఎగబాకి 4,530.42 డాలర్లు పలికింది. ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలుండటంతో మదుపరులు తమ పెట్టుబడులను సురక్షితమైన అతి విలువైన లోహాలవైపు మళ్లించడంతో వీటి ధరలు దూసుకుపోతున్నాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. అలాగే ఔన్స్ వెండి తొలిసారిగా 75 డాలర్ల మార్క్‌ను దాటింది. ప్రస్తుతం ఔన్స్ వెండి 79.25 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## బజాజ్ పల్సర్ 150కి కొత్త లుక్..
## కొత్త రంగులతో ఎల్ఈడీ లైట్స్.. మరెన్నో..



బజాజ్ పల్సర్ 150 చాలా కాలంగా భారతీయ యువత, ప్రయాణికులకు ఇష్టమైన బైక్. సంవత్సరాలుగా ఈ బైక్ పెద్ద మార్పులు లేకుండా దాని ప్రజాదరణను కొనసాగించింది. కానీ ఇప్పుడు కంపెనీ కాలానికి అనుగుణంగా దీనిని అప్‌డేట్ చేసింది. 2010 తర్వాత పల్సర్ 150 ఇంత పెద్ద విజువల్ అప్‌డేట్‌ను పొందడం ఇదే మొదటిసారి. ఈ అప్‌డేట్ అతిపెద్ద ఆకర్షణ కొత్త LED హెడ్‌ల్యాంప్, LED టర్న్ ఇండికేటర్లు. మంచి విషయం ఏమిటంటే బజాజ్ పల్సర్ గుర్తింపుపై రాజీపడలేదు. ఇంధన ట్యాంక్, క్లిప్-ఆన్ హ్యాండిల్‌బార్లు, స్ప్లిట్ సీటు, అల్లాయ్ వీల్స్, స్పోర్టి ఎగ్జాస్ట్ కండరాల డిజైన్ అలాగే ఉంచింది.

**కొత్త రంగు ఎంపికలు, తాజా లుక్**

కొత్త బజాజ్ పల్సర్ 150 లో LED అప్‌డేట్‌లు, కొత్త కలర్ ఆప్షన్లు, అప్‌డేట్ చేసిన గ్రాఫిక్స్ ఉన్నాయి. ఈ మార్పులు పెద్ద డిజైన్ మార్పులు కానప్పటికీ, అవి బైక్‌ను మునుపటి కంటే తాజాగా భావిస్తాయి. కొత్త కలర్ స్కీమ్‌తో పల్సర్ 150 ఇప్పుడు మరింత ప్రీమియం, ఆకర్షణీయంగా కనిపిస్తుంది. LED హెడ్‌ల్యాంప్, ఇండికేటర్లు బైక్‌కు పదునైన, మరింత దూకుడుగా ఉండే ఫ్రంట్ ఎండ్‌ను అందిస్తాయి. ఈ అప్‌డేట్‌లు ముఖ్యంగా పల్సర్ పనితీరు, విశ్వసనీయతతో పాటు ఆధునిక రూపాన్ని కోరుకునే కస్టమర్‌లను ఆకర్షిస్తాయి.

# కార్ల ధరలు పెంచిన రెనో

న్యూఢిల్లీ,
రెనో ఇండియా తన వాహన ధరలను 2 శాతం వరకు పెంచుతున్నట్టు ప్రకటించింది. ఉత్పత్తి వ్యయం అధికం కావడంతో ధరలు పెంచాల్సి వచ్చిందని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ఈ పెంపు జనవరి నుంచి అమల్లోకి రానున్నాయి. ఫ్రెంచ్‌కు చెందిన ఆటోమొబైల్ సంస్థ తీసుకున్న తాజా నిర్ణయంతో క్విడ్, ట్రైబర్, కైగర్ మాడళ్లు మరింత ప్రియంకాబోతున్నాయి. రూపాయి విలువ పడిపోవడం, కమోడిటీ ఉత్పత్తుల ధరలు భారీగా పెరగడంతో సంస్థపై పడుతున్న అదనపు భారాన్ని తగ్గించుకోవడంలో భాగంగా వాటి ధరలను పెంచాల్సి వచ్చిందని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ఇప్పటికే మెర్సిడెజ్-బెంజ్, బీఎండబ్ల్యూ, ఆడీలు తమ వాహన ధరలను పెంచబోతున్నట్టు ప్రకటించాయి



**ట్రయంప్ బైకుల ప్రియం**

స్పోర్ట్స్ బైకుల తయారీ సంస్థ ట్రయంప్ మోటర్‌సైకిల్ మరోసారి వాహన ధరలను పెంచబోతున్నట్టు ప్రకటించింది. నూతన సంవత్సరంలో అన్ని రకాల బైకుల ధరలను సవరిస్తున్నట్టు ఒక ప్రకటనలో వెల్లడించింది. రూపాయి నష్టాల దృష్ట్యా 350 సీసీ మించిన టూవీలర్ల ధరలు పెరుగుతున్నాయి.

## స్పోర్ట్స్

# అండర్-19 వరల్డ్‌కప్‌లో వైభవ్..
# టీమిండియా స్క్వాడ్ ఇదే..!

టోర్నీ ఏదైనా విధ్వంసక శతకాలతో రెచ్చిపోతున్న వైభవ్ సూర్యవంశీ() మరో బిగ్ టోర్నమెంట్‌కు ఎంపికయ్యాడు. ఇటీవలే రైజింగ్ స్టార్స్ ఆసియా కప్‌తో పాటు అండర్ -19 ఆసియాకప్‌లో సెంచరీలతో చెలరేగిన వైభవ్‌కు ఐసీసీ పురుషుల అండర్-19 ప్రపంచకప్ స్క్వాడ్‌లో చోటు దక్కింది. వచ్చే ఏడాది జనవరిలో జరుగనున్న ఈ ఈవెంట్ కోసం ఆయుష్ మాత్రే (ూాఎబంష్త్ర వీష్త్రఘ్‌తీవ) కెప్టెన్‌గా శనివారం 15 మందితో కూడిన బృందాన్ని సెలెక్టర్లు ఎంపిక చేశారు. ఆల్‌రౌండర్ విహాన్ మల్హోత్రా వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు.ఇప్పటికే ఐదుసార్లు అండర్ -19 ప్రపంచకప్ గెలుపొందిన భారత్ ఆరో టైటిల్‌పై కన్నేసింది. ఈ మెగా సన్నాహకాల్లో టీమిండియా త్వరలోనే దక్షిణాఫ్రికా పర్యటనకు వెళ్లనుంది. దాంతో.. ఈ వన్డే సిరీస్‌తో పాటు ప్రపంచకప్ కోసం శనివారం సెలెక్టర్లు స్క్వాడ్‌ను ప్రకటించారు. ఆయుష్ మాత్రే సారథిగా, విహాన్ మల్హోత్రా డిప్యూటీగా పటిష్టమైన బృందాన్ని ఎంపిక చేశారు.

ఈ పదిహేనే మందిలో ఇటీవలే ఆసియా కప్‌లో అద్భుతంగా రాణించిన వైభవ్, అరోన్, అభిగ్యాన్,




దీపేశ్‌లు ఉన్నారు. నమీబియా, జింబాబ్వే వేదికగా అండర్ -19 ప్రపంచకప్ జరుగనుంది. గ్రూప్ -బీలో ఉన్న భారత జట్టు లీగ్ దశలో యూఎస్ఏ, న్యూజిలాండ్, బంగ్లాదేశ్‌తో తలపడనుంది.


**భారత స్క్వాడ్**

ఆయుష్ మాత్రే (కెప్టెన్), విహాన్ మల్హోత్రా(వైస్ కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, అరోన్ జార్జ్, వేదాంత్ త్రివేది, అభిగ్యాన్ కుందు(వికెట్ కీపర్), హర్వన్ష్ సింగ్(వికెట్ కీపర్), ఆర్.ఎస్ అంబ్రిస్, కనిష్క్ చౌహాన్, ఖిలాన్ పటేల్, మొహమ్మద్ ఎనాన్, హెనిల్ పటేల్, దీపేశ్, కిషన్ కుమార్ సింగ్, ఉద్ధవ్ మోహన్.

ఐపీఎల్‌లో 35 బంతుల్లోనే సెంచరీతో సంచలనం సృష్టించిన వైభవ్ సూర్యవంశీ జూనియర్ స్థాయిలో దంచేస్తున్నాడు. రైజింగ్ స్టార్స్ ఆసియా కప్, అండర్ -19 ఆసియాకప్‌లో మెరుపు శతకాలు బాదిన ఈ చిచ్చరపిడుగు.. విజయ్ హజారే ట్రోఫీలో 190 పరుగులతో విరుచుకుపడ్డాడు. అయితే.. రైజింగ్ స్టార్స్, ఆసియాకప్‌లో లీగ్ దశలో దంచేసిన వైభవ్ కీలకమైన ఫైనల్లో తేలిపోయాడు. దాంతో.. ఈ కుర్రాడు బిగ్ మ్యాచ్ ప్లేయర్‌గా రాటుదేలాల్సిన అవసరం ఎంతో ఉంది.

## ఆ ఓటమి బాధిస్తోంది..
### టీమిండియాపై ప్రతీకారం తీర్చుకుంటాం..!

: ప్రపంచకప్ ఏదైనా ఆస్ట్రేలియా ఆధిపత్యం మామూలే. కానీ, పదమూడో సీజన్ వన్డే వరల్డ్‌కప్‌లో మాత్రం భారత జట్టు చేతిలో మాజీ ఛాంపియన్ సెమీస్‌లోనే ఇంటిదారి పట్టింది. రికార్డు స్థాయిలో తమను కప్ గెలవకుండా చేసిన



టీమిండియాపై ఆసీస్ జట్టు సభ్యులు కాస్త గుర్రుగానే ఉన్నారు. తాజాగా కంగారూ పేసర్ కిమ్ గార్త్ మాట్లాడుతూ.. సెమీఫైనల్లో ఓటమిని తాము ఇంకా మర్చిపోలేదని అంది. టీమిండియాపై కచ్చితంగా ప్రతీకారం తీర్చుకుంటామని ఆమె అంటోంది.ఆస్ట్రేలియా బ్రాడ్‌కాస్టింగ్ కార్పోరేషన్ పాడ్‌కాస్ట్‌లో శనివారం కిమ్ గార్త్ మాట్లాడింది. ఈ సందర్భంగా వన్డే ప్రపంచకప్ సెమీఫైనల్లో టీమిండియా చేతిలో ఓటమిని ప్రస్తావించింది. వచ్చే ఏడాది స్వదేశంలో జరుగబోయే ద్వైపాక్షిక సిరీస్‌లో భారత్‌ను ఓడించి దెబ్బకు దెబ్బ తీస్తామని ధీమాగా చెప్పిందీ స్పీడ్‌స్టర్. 'పదమూడో సీజన్ వన్డే వరల్డ్‌కప్ సెమీఫైనల్లో ఓటమి మమ్మల్ని ఇంకా బాధిస్తోంది. భారత్ మెరుగైన జట్టే. ఇండియాలో ఆడిన ప్రతి మ్యాచ్ గొప్పగా అనిపిస్తుంది. అయినా సరే పరాజయాన్ని ఇప్పటికీ మేము జీర్ణించకోలేకపోతున్నాం. ఆ ఓటమికి బదులు తీర్చుకుంటాం. రెండు నెలల్లో టీ20, వన్డే సిరీస్, టెస్టు మ్యాచ్ కోసం టీమిండియా మా దేశానికి వస్తుంది. అప్పుడు ఓడించి ప్రతీకారం తీర్చుకుంటాం' అని గార్త్ పేర్కొంది. సెమీఫైనల్లో గార్త్ 7 ఓవర్లలో 46 పరుగులిచ్చి 2 వికెట్లు తీసంది. 2026లో మూడు ఫార్మాట్ల సిరీస్ కోసం భారత జట్టు ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లనుంది. ఫిబ్రవరి- మార్చిలో ఆతిథ్య జట్టుతో టీమిండియా మూడు టీ20లు, మూడు వన్డేలు, ఒక టెస్టు మ్యాచ్ ఆడనుంది.డీవై పాటిల్ మైదానం వేదికగా జరిగిన సెమీఫైనల్లో ఫొబే లిచ్‌ఫీల్డ్ (119) సెంచరీతో మెరవగా ఆస్ట్రేలియా 338 పరుగులు చేసింది. అనంతరం భారీ ఛేదనలో టీమిండియాకు షాకిస్తూ ఆరంభంలోనే ఓపెనర్లు షఫాలీ వర్మ, స్మృతి మంధానలను ఔట్ చేసింది కిమ్ గార్త్. దాంతో.. భారత్ ఒత్తిడిలో పడినా జెమీమా రోడ్రిగ్స్ (127 నాటౌట్) చిరస్మరణీయ శతకంతో ఆసీస్ ఆశలపై నీళ్లు చల్లింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(89)తో కీలక భాగస్వామ్యం.. ఆపై రీచా ఘోష్(26) మెరుపులతో ఫైనల్ చేరింది భారత్. టైటిల్ పోరులో దక్షిణాఫ్రికాను 52 పరుగుల తేడాతో చిత్తుచేసిన విమెన్ ఇన్ బ్లూ తొలిసారి విశ్వవిజేతగా అవతరించింది.

# త్వరలోనే టీమిండియాకు కొత్త కోచ్..

### ఆ సొగసరి ఆటగాడికే ఓటేస్తారా..!

ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ 2025-27ను సిరీస్ సమంతో ఆరంభించిన భారత్ అనూహ్యంగా తడబడుతోంది. స్వదేశంలో వెస్టిండీస్‌ను వైట్‌వాష్ చేసిన శుభ్‌మన్ గిల్ సేన.. దక్షిణాఫ్రికా చేతిలో చిత్తుగా ఓడింది. రెండు మ్యాచుల్లో ఓటమితో కోచ్ గౌతం గంభీర్ (+ఖబ్ఖఎ +ఖఎఎష్త్రఅతీ)ను తప్పించాలనే డిమాండ్లు వచ్చాయి. ప్రయోగాల పేరుతో భారత టెస్టు క్రికెట్‌ను నాశనం చేస్తున్న గౌతీ బదులు సుదీర్ఘ ఫార్మాట్‌లో అనుభవజ్ఞుడైన వీవీఎస్ లక్ష్మణ్(ఎఞా ఝఇఞఅ)కు బాధ్యతలు అప్పగిస్తారని కథనాలు వస్తున్నాయి. సఫారీల దెబ్బకు రెండు టెస్టుల్లో ఓడిన తర్వాత బీసీసీఐ పెద్దలు మాజీ సొగసరి బ్యాటర్‌ను సంప్రదించారని సమాచారం.సొంతగడ్డపై



సింహంలా గర్జించే భారత జట్టు గంభీర్ కోచింగ్‌లో విఫలమవుతోంది. న్యూజిలాండ్ చేతిలో వైట్‌వాష్‌ను మరుకవ ముందే దక్షిణాఫ్రికా 2-0తో సిరీస్ కొల్లగొట్టింది. ఒకప్పుడు అజేయ శక్తిగా దూసుకెళ్లిన టీమిండియాను గంభీర్ పరాజయాల తోవ తొక్కిండానే విమర్శలు వచ్చాయి. దాంతో.. గౌతీని వైట్‌బాల్‌కే పరిమితం చేసి టెస్టులకు కొత్త కోచ్ ఉండాలనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలోనే మాజీ టెస్టు స్పెషలిస్ట్ లక్ష్మణ్‌ను బీసీసీఐ సంప్రదించిందని టాక్.అయితే.. అతడు మాత్రం బెంగళూరలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్(జశీజు)కు హెడ్‌గా ఉండేందుకే ఇష్ట పడుతున్నాట. అయినా సరే వచ్చే ఏడాది టీ20 ప్రపంచకప్‌లో టీమిండియా ప్రదర్శనను బట్టి గంభీర్‌ను కొనసాగించాలా? వద్దా? అనే నిర్ణయానికి వస్తామని బీసీసీఐ సన్నిహిత వర్గాలు పేర్కొంటున్నాయి.ఆసక్తి చూపకపోవడంతోనే'ప్రస్తుతం గంభీర్‌కు అన్నివిధాల మద్దతు లభిస్తోంది. కోచ్‌గా అతడి కాంట్రాక్ట్ 2027 వన్డే ప్రపంచకప్ వరకూ ఉంది. అయితే.. వచ్చే టీ20 ప్రపంచకప్‌ను టీమిండియా నిలబెట్టుకున్నా.. ఫైనల్ చేరినా గంభీర్‌కు ఢోకా లేదు. అలా జరగలేదంటే గంభీర్ కోచింగ్ కాంట్రాక్ట్‌ను సమీక్షించే అవకాశముంది. టెస్ట్ కోచ్‌గా గౌతీ కొనసాగుతాడా? లేదా? అనేది ఆసక్తికరం. ఎందుకంటేడ లక్ష్మణ్ సహా కొందరు ఆసక్తి చూపకపోవడంతోనే అతడు రెడ్ బాల్ కోచ్‌గా ఇంకా ఉన్నాడు' అని ప్రెస్ ట్రస్ట్ ఆఫ్ ఇండియాతో బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి.




# సల్మాన్ ఖాన్ 'బ్యాటిల్ ఆఫ్ గాల్వన్' టీజర్ విడుదల

బాలీవుడ్ సూపర్ స్టార్ సల్మాన్ ఖాన్ తన 60వ పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు అదిరిపోయే గిఫ్ట్ ఇచ్చారు. ఆయన నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'బ్యాటిల్ ఆఫ్ గాల్వన్' నుంచి తాజాగా టీజర్‌ను నేడు విడుదల చేశారు. ఈ టీజర్‌లో సల్మాన్ ఖాన్ మునుపెన్నడూ లేని విధంగా ఒక సీరియస్ ఆర్మీ ఆఫీసర్ పాత్రలో కనిపించబోతున్నాడు. గల్వాన్ లోయ ఘర్షణల నేపథ్యంలో సాగే ఈ కథలో ఆయన నటన చాలా ఇంటెన్సివ్‌గా ఉంది. 2020లో భారత్–చైనా సరిహద్దుల్లోని గల్వాన్ లోయలో జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రంలో సల్మాన్ ఖాన్, గల్వాన్ పోరాటంలో అసువులు బాసిన తెలంగాణ ముద్దుబిడ్డ కల్నల్ సంతోష్ బాబు పాత్రలో కనిపిస్తారనే ప్రచారం జరుగుతోంది (అయితే దీనిపై పూర్తి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది). టీజర్‌లో 'చావుకి భయం ఎందుకు.. అది ఎలాగైనా వస్తుంది' అనే డైలాగు అభిమానుల్లో పూనకాలు తెప్పిస్తుంది. ఈ సినిమాకు అపూర్వ లఖియా దర్శకత్వం వహిస్తుండగా.. సల్మాన్ ఖాన్ సరసన చిత్రాంగద సింగ్ కథానాయికగా నటిస్తోంది. హిమేష్ రేషమియా సంగీతం అందించబోతున్నాడు. ఈ చిత్రం ఏప్రిల్ 17, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.



## క్రేజీ ఫొటోస్‌తో కవ్విస్తున్న పాయల్ రాజ్ పుత్..

పాయల్ రాజ్ పుత్.. ఒకే ఒక్క సినిమాతో ఓవర్ నైట్ లో స్టార్ గా మారిపోయింది అందల భామ పాయల్ రాజ్ పుత్. అజయ్ భూపతి దర్శకత్వంలో వచ్చిన ఆర్ఎక్స్ 100 సినిమాతో ఈ అమ్మడు టాలీవుడ్ కు పరిచయం అయ్యింది. తొలి సినిమాతోనే మంచి విజయాన్ని అందుకుంది.ఆర్ ఎక్స్ 100 సినిమాలో ఈ అమ్మడు తన అందాలతో రెచ్చిపోయింది. ముఖ్యంగా రొమాంటిక్ సీన్స్ లో రెచ్చిపోయి నటించింది పాయల్ రాజ్ పుత్. దాంతో కుర్రకారు ఈ అమ్మడి అందానికి ఫిదా అయ్యారు. ఆతర్వాత వరుసగా ఆఫర్స్ అందుకుంది పాయల్. బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా మారిపోయింది. కేవలం గ్లామర్ రోల్స్ మాత్రమే కాదు నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్రల్లోనూ మెరిసింది ఈ వయ్యారి భామ. అలాగే బడా హీరోల సరసన కూడా సినిమాలు చేసింది. అయినా కూడా అంతగా క్లిక్ అవ్వలేక పోయింది పాయిల్. రవితేజకు జోడిగా డిస్కో రాజా, వెంకటేష్ సరసన వెంకీ మామ సినిమాలు చేసింది. కానీ ఈ రెండు సినిమాలు అంతగా ఆకట్టుకోలేకపోయాయి. దాంతో ఈ అమ్మడు రేస్ లో వెనుకబడిపోయింది. చాలా రోజుల తర్వాత మంగళవారం అనే సినిమాతో హిట్ అందుకుంది. ఇక ఇప్పుడు ఈ భామకు ఆఫర్స్ తగ్గుతూ వచ్చాయి. దాంతో ఈ అమ్మడు సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ దర్శకనిర్మాతల ఆకర్షిస్తుంది. హాట్ హాట్ ఫోటోలను షేర్ చేస్తూ కుర్రకారు గుండెల్లో బాణాలు గుచ్చుతోంది ఈ వయ్యారి భామ.




## శర్వానంద్ చేతుల మీదుగా 'కాగితం పడవలు' టీజర్ లాంచ్..

### హార్ట్ టచింగ్ లవ్ స్టోరీ!

టాలీవుడ్ చార్మింగ్ స్టార్ శర్వానంద్ తాజాగా 'కాగితం పడవలు' చిత్ర టీజర్‌ను లాంచ్ చేసి చిత్ర యూనిట్‌కు తన శుభాకాంక్షలు తెలియజేశారు. ఎంజీఆర్ తుకారాం దర్శకత్వంలో వర్ధన్, కృష్ణప్రియ జంటగా నటించిన ఈ చిత్రాన్ని ఎస్ఎల్ఎన్ సినీ క్రియేషన్స్, ప్రణధి క్రియేషన్స్ మరియు నవ నారాయణ సినీ క్రియేషన్స్ బ్యానర్లపై కీర్తన నరేష్, టి.ఆర్. ప్రసాద్ రెడ్డి వెంకట్రాజుల, గాయిత్రమ్మ అంజనప్ప అత్యున్నత నిర్మాణ విలువలతో నిర్మించారు.టీజర్ విడుదల సందర్భంగా శర్వానంద్ మాట్లాడుతూ.. ఎలాంటి సినీ నేపథ్యం లేకపోయినా ప్యాషన్‌తో సినిమా తీసిన దర్శకుడు తుకారాంను అభినందించారు. టీజర్ చాలా నిజాయితీగా, ఆసక్తికరంగా ఉందని, హీరో వర్ధన్ తన మొదటి సినిమా అనిపించకుండా అద్భుతంగా నటించాడని ప్రశంసించారు. "ప్రేమ నిప్పులాంటిది.. అది జీవితానికి వెలుగునిచ్చే దీపం అవ్వచ్చు లేదా దహించే కార్చిచ్చు కావచ్చు" అనే డైలాగ్‌తో సాగిన ఈ టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. హీరో హీరోయిన్ల మధ్య కెమిస్ట్రీ, హార్ట్ టచింగ్ ఎమోషన్స్, నౌఫల్ రాజా అందించిన నేపథ్య సంగీతం మరియు రుద్రసాయి విజువల్స్ సినిమాపై అంచనాలను పెంచేశాయి. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఎం. హిమ బిందు పర్యవేక్షణలో రూపొందిన ఈ చిత్రం త్వరలోనే థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ చిత్రానికి సంబంధించిన పబ్లిసిటీ పనులను పీఆర్వో తేజస్వి సజ్జా నిర్వహిస్తున్నారు.


## అ క్రికెటర్ అంటే పిచ్చి..

### ఇన్నాళ్లకు అసలు విషయం చెప్పిన కాజల్..

తెలుగు సినిమా పరిశ్రమలో తమకంటూ మంచి స్థానం సంపాదించుకున్న తారలలో కాజల్ అగర్వాల్. తక్కువ సమయంలోనే స్టార్ హీరోలతో వరుస అవకాశాలు అందుకుంటూ అడియన్స్ హృదయాలను గెలుచుకుంది. ప్రస్తుతం ఈ అమ్మడు అటు ఫ్యామిలీ లైఫ్, ఇటు కెరీర్ రెండింటిని బ్యాలెన్స్ చేస్తుంది. కెరీర్ మంచి ఫాంలో ఉన్నప్పుడే తన స్నేహితుడిని పెళ్లి చేసుకున్న కాజల్.. ఆ తర్వాత సినిమాలు తగ్గించింది. కొన్నాళ్లు బ్రేక్ తీసుకున్న ఈ ముద్దుగుమ్మ.. ఇప్పుడు మంచి అవకాశం కోసం వెయిట్ చేస్తుంది. ఈ క్రమంలోనే తాజాగా ఈ అమ్మడుకు సంబంధించిన ఓ న్యూస్ సోషల్ మీడియాలో వైరలవుతుంది. తెలుగు, తమిళంలో స్టార్ హీరోలతో నటించిన కాజల్ కు ఓ క్రికెటర్ అంటే క్రష్ అంట. ఇంతకీ అతడు ఎవరో తెలుసుకుందామా.లక్ష్మీ కళ్యాణం సినిమాతో తెరంగేట్రం చేసిన కాజల్.. చందమామ సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. ఈ మూవీ ఆమె కెరీర్ మార్చేసింది. ఆ తర్వాత వరుసగా స్టార్ హీరోలతో అవకాశాలు అందుకుని టాప్ హీరోయిన్ గా ఎదిగింది. కెరీర్ పీక్స్ లో ఉన్నప్పుడే తన స్నేహితుడు గౌతమ్ కిచ్లూను పెళ్లి చేసుకుంది. ఈ దంపతులకు బాబు ఉన్నాడు. కొన్నాళ్లు బ్రేక్ తీసుకున్న కాజల్.. ఇప్పుడు సరైన అవకాశం కోసం వెయిట్ చేస్తుంది. ఈ క్రమంలోనే గతంలో కాజల్ చేసిన కామెంట్స్ ఇప్పుడు నెట్టింట వైరలవుతున్నాయి.కాలేజీ రోజుల్లోనే తాను ఒక అబ్బాయిని ప్రేమించానని తెలిపింది. తనది వన్ సైడ్ లవ్ స్టోరీ అని.. అతడి పేరు అక్షయ్ అని చెప్పుకొచ్చింది. ఇదెలా ఉంటే.. తనకు క్రికెట్ అంటే చాలా ఇష్టమని టీమిండియా క్రికెటర్ రోహిత్ శర్మకు తాను వీరాభిమానని తెలిపింది. ప్రస్తుతం కాజల్ చేసిన కామెంట్స్ మరోసారి నెట్టింట వైరల్ గా మారాయి. చివరగా సత్యభామ, ఇండియన్ 2 వంటి చిత్రాల్లో నటించింది.



# ఛాంపియన్ ప్రతి ఒక్కరూ మెచ్చే సినిమా




కుటుంబ సమేతంగా చూడాల్సిన సినిమా 'ఛాంపియన్ అన్నారు హీరో రోషన్. ఈ చిత్రం యదార్థగాధలకు ప్రతిరూపం అన్నారు. రోషన్,. అనస్వర రాజన్ జంటగా నటించిన ఈ చిత్రాన్ని ప్రదీప్ అద్వైతం తెరకెక్కించారు. స్వప్న దత్, జీకే మోహన్, జెమినీ కిరణ్ నిర్మించారు. నందమూరి కల్యాణ్ చక్రవర్తి ముఖ్య పాత్ర పోషించారు. ఈ సినిమా ఇటీవల విడుదలైన నేపథ్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో సక్సెస్‌మీట్ ఏర్పాటు చేశారు. 'ఛాంపియన్' నాకెంతో ప్రత్యేకమైన సినిమా అన్నారు హీరో రోషన్. 'ఇది పిల్లలతో కలిసి చూడాల్సిన చిత్రం. ఇది ప్రతి ఒక్కరికీ నచ్చింది' అన్నారు దర్శకుడు ప్రదీప్ అద్వైతం. ఈ కార్యక్రమంలో నందమూరి కల్యాణ్ చక్రవర్తి, స్వప్న దత్, జెమినీ కిరణ్, జీకే మోహన్, అనస్వర రాజన్, మిక్కీ జే మేయర్, రచ్చ రవి, సంజయ్ బలగం, యశ్ తదితరులు పాల్గొన్నారు.

Edited, printed and owned by **BHIROJU KISHORE CHARY,** printed at **SHIVA KESHAVA PRINTERS**, FLAT NO .30, BLOCK NO.8, RAJEEVHEELS JAGATH-GIRIGUTTA QUTHBULLAPUR, MEDCHAL,(MALKAJGIRI)editor BHIROJU KISHORE CHARY,RNI Regn No TELTEL 2021/81472